# విశాల భారతి

తెలుగు దినపత్రిక

21-02-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 50


## టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపులు బంద్

2026 ఏప్రిల్ 1 నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపుల నిలిపివేత

కేవలం ఫాస్టాగ్, యూపీఐ డిజిటల్ మార్గాల్లోనే టోల్ వసూళ్లు

ప్రయాణ సమయం ఆదా, ట్రాఫిక్ జామ్‌ల నివారణే ప్రధాన లక్ష్యం

02



## ఏఐ విప్లవానికి భారత్ వేదిక కావాలి

### జీఎస్టీ తరహాలో జాతీయ 'ఏఐ కౌన్సిల్' ఏర్పాటుకు ప్రతిపాదన

### కేంద్రంలో ప్రత్యేకంగా 'ఏఐ మంత్రిత్వ శాఖ' అవసరం



హైదరాబాద్‌లో నేషనల్ ఏఐ వార్‌రూమ్ ఏర్పాటుకు సిద్ధం

తెలంగాణలో దేశంలోనే తొలి 'ఏఐ స్టార్టప్ విలేజ్'

గూగుల్, మెటా వంటి ప్లాట్‌ఫార్మ్ క్రియేటర్లుగా ఎదగాలి

యువత కోసం భారీస్థాయిలో రీ-స్కిల్లింగ్ వ్యూహం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆర్థిక రంగంలో జీఎస్టీ కౌన్సిల్ ఏ విధంగా నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందో, అదే తరహాలో ఏఐ పరిజ్ఞానాన్ని నియంత్రించడానికి, ప్రోత్సహించడానికి జాతీయ స్థాయిలో ఒక 'ఏఐ కౌన్సిల్' ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. సాంకేతికత వేగంగా మారుతున్న నేపథ్యంలో, చట్టపరమైన రక్షణలు, జాతీయ భద్రతను పర్యవేక్షించడానికి కేంద్రంలో ప్రత్యేకంగా ఒక 'ఏఐ మంత్రిత్వ శాఖ'ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రధానమంత్రిని కోరారు. ఇది దేశవ్యాప్తంగా ఏఐ వినియోగంలో ఏకరూపతను, భద్రతను తీసుకువస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణను గ్లోబల్ ఏఐ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా, హైదరాబాద్ కేంద్రంగా 'జాతీయ ఏఐ వార్‌రూమ్' ఏర్పాటు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఏఐ పురోగతిని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, డేటా విశ్లేషణ మరియు అత్యవసర నిర్ణయాలు తీసుకోవడంలో ఈ వార్‌రూమ్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సాంకేతిక హబ్‌గా ఇప్పటికే గుర్తింపు పొందిన హైదరాబాద్, ఏఐ విప్లవానికి సరైన వేదిక అవుతుందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. భారత ప్రభుత్వం సహకారంతో దేశంలోనే మొట్టమొదటి 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో ఏర్పాటు చేయాలన్నది తమ ప్రభుత్వ

మిగతా 2లో..

**కృత్రిమ మేధస్సు యావత్ ప్రపంచాన్ని శాసిస్తున్న ప్రస్తుత తరుణంలో, భారతదేశం కేవలం ఒక వినియోగదారుగానో లేదా సేవలందించే దేశంగానో మిగిలిపోకూడదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ప్రతిష్టాత్మక సమ్మిట్‌లో ఆయన కీలకోపన్యాసం చేస్తూ, ఏఐ రంగంలో దేశం అనుసరించాల్సిన వ్యూహాలపై స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. ముఖ్యంగా రాష్ట్రాల భాగస్వామ్యంతో జాతీయ స్థాయిలో ఒక పటిష్టమైన వ్యవస్థను నిర్మించాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.**

## కత్తులు, కటార్లతో కాదు చేతులతో చంపేస్తా

వరంగల్ శివాజీ జయంతి ఉత్సవాల్లో రాజాసింగ్ ఘాటు వ్యాఖ్యలు

అక్బరుద్దీన్ '15 నిమిషాల' పాత డైలాగులపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే

సెక్యూరిటీ లేకుండా వస్తే వట్టి చేతులతోనే తేల్చుకుందామని సవాల్

తేదీ, సమయం, వేదిక ఏదైనా సరే.. నేను సిద్ధమంటూ ప్రకటన

కత్తులు, గన్లు అవసరం లేదని, దమ్ముంటే రావాలని పిలుపు

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన రాజాసింగ్ సంచలన ప్రసంగం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి నిప్పు రాజుకుంది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తనదైన శైలిలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను దుమారం రేపుతున్నాయి. వరంగల్ వేదికగా జరిగిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీని లక్ష్యంగా చేసుకుని విసిరిన సవాల్ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పాతబస్తీ రాజకీయాలకే పరిమితమైన ఓవైసీ సోదరులకు ధైర్యం ఉంటే బయటకు రావాలని, గతంలో హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలకు త్వరలోనే తగిన సమాధానం లభిస్తుందని ఆయన హెచ్చరించారు. గతంలో అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన '15 నిమిషాలు గడువు ఇస్తే' అనే వివాదాస్పద వ్యాఖ్యలపై రాజాసింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేపదే అదే పాత డైలాగులు కొట్టడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఆ మాటలు చెప్పడం మానుకోవాలని సూచించారు. 15 నిమిషాలు కాదు కదా, 15 ఏళ్ల సమయం ఇచ్చినా మీరు ఏమీ చేయలేరని ఎద్దేవా చేశారు. కేవలం మైకుల ముందు ప్రగల్భాలు పలకడం కాదని, చేతల్లో చూపించాలని ఆయన ఘాటుగా స్పందించారు. ఈ వ్యాఖ్యలు సభకు హాజరైన యువతలో ఒక్కసారిగా ఉత్సాహాన్ని నింపాయి. తన ప్రసంగంలో భాగంగా అక్బరుద్దీన్‌కు రాజాసింగ్ ఒక బహిరంగ సవాల్ విసిరారు. నిజంగా నీకు దమ్ము, ధైర్యం ఉంటే నీకున్న సెక్యూరిటీని

మిగతా 3లో..

## పుష్ప2' తొక్కిసలాట కేసులో బిగ్ షాక్



- సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో పోలీసులకు ఎదురుదెబ్బ
- నాంపల్లి కోర్టులో ఛార్జ్‌షీట్‌ను తిరస్కరించిన న్యాయస్థానం
- అల్లు అర్జున్, నిర్మాణ సంస్థపై అభియోగాలు సరిగా లేవని వ్యాఖ్య
- తదుపరి విచారణలో లోపాలను సరిదిద్దాలని పోలీసులకు ఆదేశం
- పుష్ప-2 ప్రీమియర్ షో సమయంలో జరిగిన దుర్ఘటనపై సుదీర్ఘ వాదనలు
- బాధితుల పక్షాన నిలబడతామన్న న్యాయవాదులు, ఆందోళనలో ఫ్యాన్స్

03

## రైతు భరోసా ఎప్పుడిస్తారు?

దేవన్నపేట దేవాదుల పంప్ హౌస్‌ను పరిశీలించిన హరీష్ రావు

ప్రాజెక్టు కోసం రూ.7,300 కోట్లు ఖర్చు చేశామన్న మాజీ మంత్రి

80 శాతం పనులు పూర్తయినా, కాంగ్రెస్ నిధులు ఇవ్వడం లేదని విమర్శ

రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డికి సూటి ప్రశ్న

మహిళలకు రూ.2,500, పెన్షన్ రూ.4,000 ఇచ్చేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

వచ్చే బడ్జెట్ అంకెల గారడీ కాకుండా వాస్తవ రూపంలో ఉండాలని డిమాండ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, రైతు సంక్షేమంపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో తూర్పారబట్టారు. హన్మకొండ జిల్లాలోని దేవన్నపేటలో ఉన్న దేవాదుల పంప్ హౌస్‌ను సందర్శించిన ఆయన, అక్కడ నిలిచిపోయిన పనులను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర తెలంగాణకు వరప్రదాయినిగా ఉన్న దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని,

మిగతా 2లో..





## ఇరాన్‌పై దాడికి అమెరికా సన్నద్ధం

### మధ్యప్రాచ్యానికి కదిలిన అమెరికా యుద్ధ నౌకలు

- ఎఫ్-22, ఎఫ్-35 స్టెల్త్ విమానాల భారీ మోహరింపు
- ఇరాన్ అణు కేంద్రాలే లక్ష్యంగా వ్యూహరచన
- ట్రంప్ తుది నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ
- జెనీవాలో కొనసాగుతున్న కీలక దౌత్య చర్చలు
- హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ హెచ్చరికలు

**విశాలభారతి, అంతర్జాతీయం:**

మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ భేరి మోగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రపంచ అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ లక్ష్యంగా చేపట్టిన భారీ సైనిక సమీకరణ ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై హాట్ టాపిక్‌గా మారింది. గత కొన్ని దశాబ్దాల్లో ఎన్నడూ లేని విధంగా పెంటగాన్ తన అమ్ములపొదిలోని అత్యంత శక్తివంతమైన ఆయుధాలను ఇరాన్ సరిహద్దులకు తరలిస్తోంది. ఈ పరిణామాలు కేవలం హెచ్చరికలకే పరిమితమా లేక నిజంగానే క్షిపణి దాడులకు నాంది పలకబోతున్నాయా అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

మిగతా 3లో..

## గురుకులాల బాగుపై సర్కార్ నజర్

- గురుకులాల్లో నిరంతర తనిఖీలకు ప్రభుత్వం శ్రీకారం
- పర్యవేక్షణ కోసం ప్రత్యేక నోడల్ అధికారుల నియామకం
- పక్కాగా డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్ రూపకల్పన
- ప్రతి నెలా 5వ తేదీలోపు నివేదికల సమర్పణ తప్పనిసరి
- ఆకస్మిక తనిఖీలతో గ్రౌండ్ లెవల్ నిఘా పెంపు
- డిజిటల్ పద్ధతిలో తక్షణమే తనిఖీ రిపోర్టుల అప్‌లోడ్

03



## ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం

- రెండున్నర సంవత్సరాలు అవుతున్న ఒక్క హామీ నెరవేరలే
- పార్టీ మారిన ఎమ్మెల్యే నేటికి ఏం అభివృ చేశారో చెప్పాలి
- ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి
- బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి రావులపల్లి రాంప్రసాద్

03

## 'అజర్' పై అయోమయం

మంత్రి అజహర్ భవితవ్యంపై ఢిల్లీలో రాహుల్ గాంధీ ఆరా

ఏప్రిల్ 30లోగా చట్టసభ సభ్యత్వం పొందకపోతే మంత్రి పదవికి ముప్పు

గవర్నర్ కోటాలో అడ్డంకులు.. ప్రత్యామ్నాయాలపై సీఎం రేవంత్ కసరత్తు

సిట్టింగ్ ఎమ్మెల్సీ రాజీనామా చేయించి అజహర్ కు అవకాశం ఇచ్చే యోచన

రేసులో పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ గౌడ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది

మార్చి నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని రేవంత్ కు అధిష్టానం ఆదేశం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజరుద్దీన్ భవిష్యత్తుపైనే నిలిచింది. ఇటీవల ఢిల్లీ వేదికగా జరిగిన కాంగ్రెస్ అగ్రనేతల భేటీలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తదితరులతో

మిగతా 2లో..



## రెండు లవంగాలు నమలండి

- రాత్రిపూట రెండు లవంగాలు నమలడం వల్ల అనూహ్య ఆరోగ్య లాభాలు
- జీర్ణక్రియ మెరుగుపడటంతో పాటు మలబద్ధకం సమస్యకు చెక్
- రోగనిరోధక శక్తిని పెంచడంలో లవంగాల పాత్ర కీలకం
- దంతాల నొప్పి, చిగుళ్ల వాపు నుంచి తక్షణ ఉపశమనం
- రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచే సహజ గుణాలు
- ఒత్తిడిని తగ్గించి ప్రశాంతమైన నిద్రకు తోడ్పడే లవంగాలు

03



# 'అజర్' పై అయోమయం

**మొదటిపేజీ తరువాయి**

రాహుల్ గాంధీ నిర్వహించిన సమావేశంలో అజహర్ ప్రస్తావన రావడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమీకరణలను దృష్టిలో ఉంచుకుని అజహర్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నప్పటికీ, సాంకేతికంగా ఆయన ఇంకా ఏ సభలోనూ సభ్యుడు కాకపోవడం ఇప్పుడు అసలు చిక్కుగా మారింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలల లోపు శాసనసభ లేదా శాసనమండలి సభ్యుడిగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. అజహర్ 2025 అక్టోబర్ 31న మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ లెక్కన 2026 ఏప్రిల్ 30 నాటికి ఆయన సభ్యత్వం ఖరారు కావాలి. లేనిపక్షంలో ఆయన మంత్రి పదవిని కోల్పోవాల్సి వస్తుంది. ఈ గడువు సమీపిస్తుండటంతో ఢిల్లీ పర్యటనలో రాహుల్ గాంధీ స్వయంగా అజహర్ గురించి అడిగి తెలుసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అజహర్ భవితవ్యంపై రేవంత్ రెడ్డి మనసులో ఏముందో తెలుసుకోవాలని అధిష్టానం ఆసక్తి కనబరిచింది. ప్రస్తుతం అజహర్‌ను ఎమ్మెల్సీగా పంపేందుకు ఉన్న మార్గాలపై రేవంత్ రెడ్డి వివరణ ఇచ్చారు. గవర్నర్ కోటాలో అజహర్ పేరును ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఫైలు పంపినప్పటికీ, దానికి ఇంకా ఆమోదం లభించలేదు. ఒకవేళ ఏప్రిల్ నెలాఖరు వరకు రాజ్‌భవన్ నుంచి సానుకూల స్పందన రాకపోతే ఏం చేస్తారని రాహుల్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీలలో ఒకరితో రాజీనామా చేయించి, ఆ ఖాళీలో అజహర్‌ను మండలికి పంపాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు సమాచారం. ఈ ప్రక్రియను మార్చి నెలలోనే పూర్తి చేయాలని రాహుల్ సూచించారు.



ఇప్పుడు అసలు ప్రశ్న ఏమిటంటే, అజహర్ కోసం తన పదవిని త్యాగం చేసే ఆ 'త్యాగరాజు' ఎవరు? కాంగ్రెస్ లో ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా ఉన్నవారి జాబితాలో పలువురు సీనియర్లు, బలమైన నేతలు ఉన్నారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, విజయశాంతి, బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ వంటి నేతలు కీలక పదవుల్లో కొనసాగుతున్నారు. వీరిలో ఎవరిని ఒప్పించి రాజీనామా చేయిస్తారనేది ఆసక్తికరంగా మారింది. విజయశాంతి వంటి నేతలను అధిష్టానమే నేరుగా ఎంపిక చేసినందున, ఆమెను రాజీనామా అడిగే సాహసం రాష్ట్ర నాయకత్వం చేసే అవకాశం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

మరోవైపు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, బస్వరాజు సారయ్య వంటి వారు కూడా ఈ జాబితాలో ఉన్నారు. అయితే వారు ఇప్పుడిప్పుడే పార్టీ మారిన నేపథ్యంలో, అజహర్ కోసం తమ పదవిని వదులుకోవడానికి సిద్ధపడతారా అన్నది సందేహమే. ముఖ్యంగా బలమైన సామాజిక వర్గ నేపథ్యం ఉన్న నేతలు ఈ ప్రతిపాదనకు ససేమిరా అనే అవకాశం ఉంది. దీంతో రేవంత్ రెడ్డికి ఎవరిని ఒప్పించాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. పార్టీ క్రమశిక్షణను గౌరవించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చే నేత కోసం అన్వేషణ మొదలైంది.

ఈ సంక్షోభంలో అందరి కళ్లు ఇప్పుడు పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పైనే ఉన్నాయి. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న ఆయన, పార్టీ అవసరాల దృష్ట్యా త్యాగం చేయడానికి మొగ్గు చూపుతారని ప్రచారం జరుగుతోంది. ఆయన రాజీనామా చేస్తే పార్టీలో ఒక సానుకూల సంకేతం వెళ్తుందని, మిగిలిన నేతలకు అది ఒక ఉదాహరణగా నిలుస్తుందని రేవంత్ వర్గం భావిస్తోంది. పైగా ఆయనకు పీసీసీ అధ్యక్ష పదవి ఉండటంతో పాటు భవిష్యత్తులో కేబినెట్ హోదాతో కూడిన ఇతర పదవులను కట్టబెట్టే అవకాశం ఉంటుందని చర్చ నడుస్తోంది.

నిజానికి అజహర్ ను మంత్రిగా కొనసాగించడం అనేది మైనారిటీ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి కాంగ్రెస్ కు అనివార్యంగా మారింది. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి అజహర్ సేవలు అవసరమని రేవంత్ రెడ్డి గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ఏ చిన్న అవకాశం దొరికినా ఆయనను మండలికి పంపాలని చూస్తున్నారు. ఢిల్లీ పెద్దలు కూడా దీనికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇప్పుడు బంతి రేవంత్ రెడ్డి కోర్టులోనే ఉంది. ఎమ్మెల్సీ పదవి వదులుకోవడానికి ఎవరైనా సిద్ధపడితే తప్ప అజహర్ గండం గట్టెక్కడం కష్టమే.

ప్రస్తుతానికి పార్టీలో చర్చల పర్వం నడుస్తోంది. ఎవరైతే తమ పదవిని త్యాగం చేస్తారో, వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు ఇస్తామని అధిష్టానం హామీ ఇస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్సీ పదవి అనేది ఆరేళ్ల కాలపరిమితితో కూడుకున్నది కాబట్టి, ఎవరూ అంత సులభంగా వదులుకోవడానికి ఇష్టపడరు. అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ వంటి యువ నేతలు ఇప్పుడిప్పుడే రాజకీయాల్లో ఎదుగుతున్నారు, కాబట్టి వారి నుంచి త్యాగాలను ఆశించడం భావ్యం కాదనే వాదన కూడా ఉంది. ఈ నేపథ్యంలో సీనియర్ల వైపే వేళ్లు చూపిస్తున్నాయి.

రాహుల్ గాంధీ ఇచ్చిన మార్చి నెలాఖరు డెడ్ లైన్ ఇప్పుడు రాష్ట్ర నాయకత్వానికి పెద్ద సవాలుగా మారింది. గవర్నర్ కోటా ఫైలు తేలకపోతే, కచ్చితంగా ఒక ఎమ్మెల్సీ చేత రాజీనామా చేయించాల్సిందే. రేవంత్ రెడ్డి తనదైన శైలిలో వ్యూహరచన చేసి ఎవరిని ఒప్పిస్తారో వేచి చూడాలి. పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గనుక త్యాగానికి సిద్ధపడితే, అజహర్‌కు లైన్ క్లియర్ అయినట్లే. ఒకవేళ అలా జరగకపోతే మరే ఇతర సీనియర్ నేత బలి అవుతారో అన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది.

మొత్తానికి అజహర్ మంత్రి పదవి కాపాడుకోవడానికి కాంగ్రెస్ లో పెద్ద కసరత్తే జరుగుతోంది. ఒకరి పదవి పోతేనే మరొకరికి పదవి దక్కే ఈ విచిత్ర పరిస్థితిలో రేవంత్ రెడ్డి ఎవరిని 'త్యాగరాజు'గా మలుస్తారో చూడాలి. ఏప్రిల్ 30 లోపు అజహర్ శాసనమండలిలో అడుగుపెట్టకపోతే అది రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా ముఖ్యమంత్రి ప్రతిష్ఠకు భంగం కలిగించే అంశం కాబట్టి, మార్చిలోనే దీనిపై ఒక స్పష్టమైన నిర్ణయం వచ్చే అవకాశం కనిపిస్తోంది.

## కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం



**ఇందిరమ్మ ఇల్లు గృహాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ నేతలు**

**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:**

కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేద ప్రజల సొంతింటి కల సాకారం అవుతుందని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ ముచ్చర్ల సంపత్ అన్నారు. శుక్రవారం మేడిపల్లిలోని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల గృహాన్ని మాజీ ఎంపీటీసీ మోటి శ్రీశైలంతో కలసి ఆయన ప్రారంభించారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులైన మొరుగు లలితకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని గృహప్రవేశం చేయడం అభినందనీయమని అన్నారు. పూర్తిగా ఇళ్లు లేని పేదవారిని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతున్నామని తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం నింపేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా ముందుంటుందన్నారు. కార్యక్రమలో నాలుగో వార్డు సభ్యులు నల్లోల్ల మమత, కలకొండ మల్లేష్, నల్లోల్ల గణేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మొయినాబాద్, విశాలభారతి: మొయినాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో యెన్కెపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శ్రీ గొంగళ్ళ రితీష్ రెడ్డిను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మండల నాయకత్వం ప్రకటించింది. మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం, రితీష్ రెడ్డి పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ పార్టీలో కొనసాగుతూనే ఇతర పార్టీలకు మద్దతు ఇచ్చారని ఆరోపించారు. పార్టీ కార్యకర్తలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించడం వల్ల పార్టీకి నష్టం కలిగిందని మండల నాయకత్వం అభిప్రాయపడింది. గత ఐదు సంవత్సరాలుగా బీఆర్ఎస్ తరపున ఎంపీటీసీగా గెలిచి పార్టీ ఆశీర్వాదంతో పదవి పొందిన వ్యక్తిగా ఉండి, అదే పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించడం తీవ్రంగా విచారకరమని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించిన అనంతరం క్రమశిక్షణాత్మక చర్యగా వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు శ్రీ గొంగళ్ళ రితీష్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు

# టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపులు బంద్

- **2026 ఏప్రిల్ 1 నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపుల నిలిపివేత**
- **కేవలం ఫాస్టాగ్, యూపీఐ డిజిటల్ మార్గాల్లోనే టోల్ వసూళ్లు**
- **ప్రయాణ సమయం ఆదా, ట్రాఫిక్ జామ్‌ల నివారణే ప్రధాన లక్ష్యం**
- **ఇప్పటికే 98 శాతానికి చేరిన ఫాస్టాగ్ వినియోగం**
- **నగదు రహిత లావాదేవీల ద్వారా టోలింగ్ వ్యవస్థలో పారదర్శకత**
- **నిబంధనల ఉల్లంఘనపై జరిమానాలు విధించే అవకాశం**




**విశాలభారతి, జాతీయం:**

జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం ఒక కీలకమైన సమాచారాన్ని అందించింది. దేశవ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాల వద్ద నగదు రూపంలో టోల్ రుసుము చెల్లించే పాత పద్ధతికి పూర్తిగా స్వస్తి పలకాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే, వచ్చే ఏడాది అంటే 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి టోల్ గేట్ల వద్ద నగదు లావాదేవీలు చరిత్రగా మిగిలిపోనున్నాయి. ఈ విప్లవాత్మక మార్పు ద్వారా ప్రయాణికులు తమ టోల్ రుసుములను కేవలం ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ పద్ధతుల్లోనే చెల్లించాల్సి ఉంటుంది. డిజిటల్ ఇండియా లక్ష్యంలో భాగంగా టోలింగ్ ప్రక్రియను అత్యంత వేగవంతంగా, సమర్థవంతంగా మార్చడమే ఈ ప్రతిపాదన వెనుక ఉన్న అసలు ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వ్యవస్థను వంద శాతం అమలు చేయడం ద్వారా టోల్ వసూళ్లలో పారదర్శకత పెరుగుతుందని భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఫాస్టాగ్ వినియోగాన్ని ప్రోత్సహించడానికి కేంద్రం తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. ఈ క్రమంలోనే నగదుపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించి, జాతీయ రహదారులపై ప్రయాణాన్ని ఒక సుఖమయమైన అనుభవంగా మార్చాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కసరత్తు చేస్తోంది.

గణాంకాల ప్రకారం, ప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు 98 శాతానికి పైగా వాహనదారులు ఇప్పటికే ఫాస్టాగ్ ద్వారానే తమ టోల్ చెల్లింపులు జరుపుతున్నారు. ఈ భారీ విజయం ప్రభుత్వానికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. కేవలం రెండు శాతం మంది మాత్రమే ఇంకా నగదు రూపంలో చెల్లింపులు చేస్తున్నారు. ఈ కొద్దిపాటి లావాదేవీల వల్ల కూడా టోల్ గేట్ల వద్ద రద్దీ ఏర్పడుతోందని అధికారులు గుర్తించారు. ఏప్రిల్ నుంచి నగదు మార్గాన్ని మూసివేయడం ద్వారా వాహనాలు ఒక్క క్షణం కూడా ఆగాల్సిన అవసరం లేకుండానే టోల్ గేట్లను దాటేలా అత్యాధునిక సాంకేతికతను వినియోగించబోతున్నారు.

ప్రస్తుతం వాహనం విండ్‌స్క్రీన్‌పై ఉండే ఫాస్టాగ్ స్టిక్కర్‌ను టోల్ ప్లాజా వద్ద ఉన్న స్కానర్లు గుర్తించి, ఆటోమేటిక్‌గా వాలెట్ లేదా బ్యాంకు ఖాతా నుంచి డబ్బును మినహాయించుకుంటున్నాయి. ఇది కాకుండా, ఎవరైనా అనుకోని పరిస్థితుల్లో ఫాస్టాగ్ బ్యాలెన్స్ లేక ఇబ్బంది పడితే, వారి కోసం యూపీఐ ద్వారా స్కాన్ చేసి చెల్లించే సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. అయితే, నగదు చెల్లింపులను పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే కఠిన జరిమానాలను అమలు చేస్తోంది. ఫాస్టాగ్ ఉండి కూడా నగదు ఇస్తే రెట్టింపు రుసుము వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే.

ఈ నూతన విధానం అమల్లోకి వస్తే జాతీయ రహదారులపై ప్రయాణం నల్లేరుపై నడకలా సాగనుంది. ముఖ్యంగా పండుగలు, సెలవు దినాల్లో టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర పేరుకుపోయే వాహనాల రద్దీకి ఇది శాశ్వత పరిష్కారమవుతుంది. దీనివల్ల ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవ్వడమే కాకుండా, ఇంధన వినియోగం కూడా తగ్గుతుంది. వాహనాలు పదేపదే గేట్ల వద్ద ఆగి మళ్ళీ స్టార్ట్ చేయడం వల్ల అయ్యే ఇంధన ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది పర్యావరణానికి కూడా మేలు చేకూరుస్తుంది.

టోల్ ఆపరేటర్ల దృష్ట్యా చూసినా, ఈ నిర్ణయం ఎంతో లాభదాయకంగా ఉంటుంది. పెద్ద మొత్తంలో నగదును భద్రపరచడం, చిల్లర సమస్యలను ఎదుర్కోవడం వంటి తలనొప్పులు తప్పుతాయి. ప్రతి వాహనం వివరాలు, వసూలైన మొత్తం డిజిటల్ రూపంలో రికార్డ్ అవుతుంది కాబట్టి ఆడిటింగ్ ప్రక్రియ అత్యంత సులభతరమవుతుంది. టోల్ వసూళ్లలో జరుగుతున్న అవకతవకలకు చెక్ పెట్టడానికి డిజిటలైజేషన్ ఒక్కటే సరైన మార్గమని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియ వల్ల ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

కేవలం జాతీయ రహదారులకే పరిమితం కాకుండా, దేశంలోని వందకు పైగా రాష్ట్ర రహదారుల టోల్ ప్లాజాల్లో కూడా ఈ డిజిటల్ విధానాన్ని ఏకీకృతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దీనివల్ల దేశవ్యాప్తంగా ప్రయాణం ఎక్కడ జరిగినా ఒకే రకమైన చెల్లింపు విధానం అందుబాటులో ఉంటుంది. సామాన్య వాహనదారుడు ప్రతి టోల్ గేట్ వద్ద చిల్లర కోసం వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా, తన మొబైల్ లేదా ఫాస్టాగ్ ద్వారా హాయిగా ప్రయాణించవచ్చు. ఈ స్మార్ట్ జర్నీ నేటి తరం ఆలోచనలకు అనుగుణంగా ఉండబోతోంది. టెక్నాలజీ మారుతున్న కొద్దీ మనం కూడా అప్డేట్ అవ్వాల్సిన అవసరం ఉందని ఈ నిర్ణయం సూచిస్తోంది. స్మార్ట్ సిటీలు, డిజిటల్ పేమెంట్స్ యుగంలో టోల్ గేట్ల వద్ద ఇంకా గంటల తరబడి క్యూలో నిలబడటం వెనుకబాటుతనమే అవుతుందని నిపుణులు అంటున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ సాహసోపేత నిర్ణయం వల్ల రోడ్డు రవాణా వ్యవస్థలో భారీ మార్పులు రానున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ప్రతి వాహనదారుడు తమ ఫాస్టాగ్ ఖాతాలను సరిచూసుకోవడం, డిజిటల్ చెల్లింపుల పట్ల పూర్తి అవగాహన పెంచుకోవడం ఎంతో ముఖ్యం. అయితే ఈ విధానం అమలులో కొన్ని సవాళ్లు కూడా ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు, స్మార్ట్ ఫోన్ వాడకం తక్కువగా ఉన్న వారు కొంత ఇబ్బంది పడవచ్చు. వారి కోసం టోల్ ప్లాజాల సమీపంలో ఫాస్టాగ్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అలాగే ఇంటర్నెట్ సమస్యలు తలెత్తకుండా హైస్పీడ్ నెట్వర్క్ సదుపాయాలను టోల్ కేంద్రాల వద్ద కల్పిస్తున్నారు.

# రైతు భరోసా ఎప్పుడిస్తారు?

**మొదటిపేజీ తరువాయి**



కానీ ప్రస్తుత పాలకులు కనీసం పట్టించుకోకపోవడం వల్ల ఆయకట్టు రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ప్రాజెక్టుల పురోగతి కుంటుపడిందని, అభివృద్ధి కంటే విమర్శలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాదుల ప్రాజెక్టు కోసం దాదాపు రూ.7,300 కోట్లు ఖర్చు చేసి, సుమారు 80 శాతం పనులను విజయవంతంగా పూర్తి చేశామని హరీష్ రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. సాగునీటి ఆయకట్టును కేవలం 47 వేల ఎకరాల నుంచి 3.17 లక్షల ఎకరాలకు పెంచడమే కాకుండా, ప్రాజెక్టుకు అవసరమైన 33 వేల ఎకరాల భూసేకరణలో ఇప్పటికే 30 వేల ఎకరాలను పూర్తి చేశామని గణాంకాలతో వివరించారు. మరో వెయ్యి నుండి రెండు వేల కోట్లు ఖర్చు చేస్తే అదనంగా 2.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిసినా, కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నర ఏళ్లుగా కనీసం రూ.100 కోట్లు కూడా కేటాయించకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు. ప్రాజెక్టుల పర్యటన అనంతరం రైతు భరోసా పంపిణీలో జరుగుతున్న ఆలస్యంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హరీష్‌రావు గట్టిగా ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగియగానే అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామని ప్రభుత్వం గొప్పలు చెప్పిందని, కానీ నెలలో 20వ తేదీ వచ్చినా ఇప్పటివరకు అతీగతీ లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు, చేస్తున్న పనులకు ఏమాత్రం పొంతన లేదని, రైతులు పెట్టుబడి సాయం కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ హయాంలో సమయానికి అందిన రైతుబంధు, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో అందని ద్రాక్షలా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. రైతు భరోసాపై తనదైన శైలిలో సెటైర్లు వేసిన హరీష్‌రావు, అసలు ఈ నిధులు నాట్లు వేసేటప్పుడు ఇస్తారా లేక కోతలు కోసేటప్పుడు ఇస్తారా అని ప్రశ్నించారు. ఇప్పటికే వరుసగా రెండు పంటలకు పెట్టుబడి సాయం అందక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, కనీసం ఈ సీజన్‌లోనైనా అన్నదాతలను ఆదుకుంటారా లేదా అని నిలదీశారు. ప్రభుత్వ జాప్యం వల్ల రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు.

రాబోయే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల గురించి ప్రస్తావిస్తూ, ఈ నెల 26న ప్రవేశపెట్టే బడ్జెట్ కేవలం అంకెల గారడీగా ఉండకూడదని, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించాలని హరీష్ రావు సూచించారు. గతంలో ఇచ్చిన హామీల మేరకు మహిళలకు ప్రతి నెలా రూ.2,500 మహాలక్ష్మి పథకం కింద నిధులు కేటాయించాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు ఉండాలని, అప్పుడే అది ప్రజల బడ్జెట్ అనిపించుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే పనులకు మధ్య ఉన్న అంతరాన్ని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

పెన్షన్ల పెంపు విషయంలో కూడా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు హరీష్ రావు. బీడీ కార్మికులు, వృద్ధులు, వితంతువులు, గీత మరియు చేనేత కార్మికులందరికీ ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని ఎన్నికల సమయంలో వాగ్దానం చేశారని, ఆ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలంటే సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. సిద్దిపేటలోని 37వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల్లో ఉన్న ఆశలు అడియాసలయ్యాయని, ప్రతి పథకం అమలులోనూ నిబంధనల పేరుతో కొర్రీలు పెడుతున్నారని హరీష్‌రావు విమర్శించారు. అభివృద్ధి పనుల కంటే గత ప్రభుత్వంపై విమర్శలు చేయడమే ప్రస్తుత మంత్రుల పనిగా మారిందని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. దేవాదుల లాంటి కీలక ప్రాజెక్టులను గాలికొదిలేయడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడుతుందని, వ్యవసాయ రంగం కుదేలైతే దానికి పూర్తి బాధ్యత రేవంత్ రెడ్డి సర్కార్ వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను గమనిస్తున్నామని, ప్రతి సమస్యపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం కేవలం మాటలతో కాలక్షేపం చేయకుండా, చేతల్లో అభివృద్ధిని చూపాలని సూచించారు. ముఖ్యంగా సాగునీటి రంగంలో నిధుల కొరత లేకుండా చూడటం వల్ల పల్లెల్లో ఆర్థిక కదలిక వస్తుందని, కానీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన చెందారు.

సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధిని ప్రస్తావిస్తూ, తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులే నేడు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని హరీష్ రావు తెలిపారు. కొత్తగా వచ్చిన వారు కేవలం రిబ్బన్ కటింగ్ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, పెండింగ్ పనులను పూర్తి చేయాలని హితవు పలికారు. సామాన్యుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాబోయే బడ్జెట్‌లోనైనా సబ్బండ వర్గాలకు న్యాయం జరిగేలా నిధుల పంపిణీ ఉండాలని ఆయన గట్టిగా కోరారు.



# ఏఐ విప్లవానికి భారత్ వేదిక కావాలి

**మొదటిపేజీ తరువాయి**

కృతనిశ్చయమని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ విలేజ్ కేవలం అంకుర సంస్థలకు నెలవుగా మాత్రమే కాకుండా, నూతన ఆవిష్కరణలకు ప్రయోగశాలగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాంకేతిక నిపుణులను, పెట్టుబడిదారులను తెలంగాణకు ఆహ్వానిస్తూ, ఇక్కడ ఉన్న అనుకూల వాతావరణాన్ని వారు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐ అనేది కేవలం కోడింగ్ లేదా సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి పరిమితం కాకూడదని, అది సామాజిక న్యాయ సాధనకు ఒక శక్తివంతమైన ఆయుధంగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పేదరిక నిర్మూలన, విద్య, వైద్యం వంటి రంగాల్లో ఏఐని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా సామాన్యుడి జీవితంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ఆయన వివరించారు. టెక్నాలజీ అనేది సమాజంలోని అట్టడుగు వర్గాలకు మేలు చేసినప్పుడే దానికి నిజమైన సార్థకత చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు.

గత కొన్ని దశాబ్దాలుగా భారతదేశం ఐటీ సేవల రంగంలో అగ్రగామిగా ఉన్నప్పటికీ, గూగుల్, మెటా, వాట్సాప్ వంటి ప్రపంచస్థాయి ప్లాట్‌ఫార్మ్‌లను సృష్టించలేకపోయామని రేవంత్ రెడ్డి ఒక చేదు నిజాన్ని గుర్తుచేశారు. ఇప్పటికైనా మనం ఆ దృక్పథాన్ని మార్చుకోవాలని, కేవలం ఇతరులకు సేవలు అందించే స్థాయి నుంచి సొంతంగా అంతర్జాతీయ స్థాయి ప్లాట్‌ఫార్మ్‌లను నిర్మించే 'క్రియేటర్స్'గా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. మన మేధస్సు మన దేశ అభివృద్ధికి బ్రాండ్‌గా మారాలని ఆయన కోరారు.ఏఐ వాల్యూ చైన్‌లో ప్రతి దశలోనూ భారత్ తన ముద్ర వేయాలని ముఖ్యమంత్రి సూచించారు. కేవలం సాఫ్ట్‌వేర్ అభివృద్ధిపైనే కాకుండా, జీపీయూ చిప్‌ల తయారీ, గ్రీన్ ఎనర్జీ అవసరాలు, భారీ డేటా స్టోరేజీ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. వీటన్నింటినీ అనుసంధానిస్తూ ఒక స్పష్టమైన, దీర్ఘకాలిక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకోవడం ద్వారానే చైనా, అమెరికా వంటి దేశాలతో పోటీపడి గ్లోబల్ లీడర్‌గా ఎదగగలమని ఆయన విశ్లేషించారు. ఏఐ వల్ల ఉద్యోగ అవకాశాలు హరించుకుపోతాయన్న సామాన్య యువత ఆందోళనలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఈ సవాలును అధిగమించేందుకు పెద్ద ఎత్తున 'రీస్కిల్లింగ్' వ్యూహాలను అమలు చేయాలని ఆయన సూచించారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేలా ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు బాధ్యత తీసుకోవాలని కోరారు. యువతలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారు యూనికార్న్ సంస్థలను స్థాపించేలా కేంద్రం ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. గతంలో యంత్రాలు కేవలం మనిషి శారీరక శ్రమను తగ్గించడానికి ఉపయోగపడేవని, కానీ నేటి ఏఐ వ్యవస్థలు మేధోపరమైన నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరాయని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ మార్పును ఒక ముప్పుగా కాకుండా ఒక గొప్ప అవకాశంగా భావించాలని ఆయన సూచించారు. కృత్రిమ మేధస్సును మానవ మేధస్సుతో సమన్వయం చేస్తూ వ్యూహాత్మక సంస్థలను నిర్మించడం ద్వారానే భారతదేశం ప్రపంచ ఏఐ రేసులో విజేతగా నిలవగలదని ఆయన నొక్కి చెప్పారు. ఏఐ అభివృద్ధిపై చర్చలు కేవలం ఏడాదికి ఒకసారి మాత్రమే జరగడం సరిపోదని, వివిధ నగరాల్లో కనీసం ఆరు నెలలకు ఒకసారి 'ఏఐ సమ్మిట్లు' నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ఇది నిరంతర చర్చలకు, కొత్త ఆలోచనల

# పుష్ప2' తొక్కిసలాట కేసులో బిగ్ షాక్

**మొదటిపేజీ తరువాయి**

గత డిసెంబర్‌లో జరిగిన ఈ ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ థియేటర్ వద్దకు వస్తున్నారని తెలియడంతో వేల సంఖ్యలో అభిమానులు తరలిరావడం, తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో తొక్కిసలాట జరిగిందని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో అల్లు అర్జున్ తో పాటు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు, థియేటర్ యజమాన్యంపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఛార్జ్‌షీట్‌ను సిద్ధం చేశారు. నాంపల్లి కోర్టు ఈ ఛార్జ్‌షీట్‌ను పరిశీలిస్తూ.. పోలీసుల వాదనలో అనేక లొసుగులు ఉన్నట్లు గుర్తించింది. ముఖ్యంగా నిందితుల పాత్రపై సరైన ఆధారాలు సమర్పించలేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఒక సినిమా వేడుకకు ప్రజలు భారీగా తరలిరావడం సహజమని, కానీ అక్కడ జరిగిన అపశ్రుతికి నేరుగా నటుడిని లేదా నిర్మాతలను ఏ ప్రాతిపదికన బాధ్యులను చేస్తారని కోర్టు ప్రశ్నించింది. సాంకేతిక లోపాలతో కూడిన ఈ నివేదికను విచారణకు స్వీకరించలేమని తేల్చి చెప్పింది. పోలీసులు సమర్పించిన దర్యాప్తు నివేదికలో సాక్షుల వాంగ్మూలాలు, సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలకు మధ్య పొంతన లేదని కోర్టు గమనించింది. నిబంధనల ప్రకారం ఛార్జ్‌షీట్‌ను మళ్లీ సరిచేసి, అవసరమైన ఆధారాలతో తిరిగి సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ పరిణామంతో అల్లు అర్జున్ కు ప్రస్తుతానికి పెద్ద ఊరట లభించినట్లయింది. ఆయన పేరును నిందితుల జాబితాలో చేర్చడంపై అప్పట్లోనే అభిమానుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి.



ఈ కేసులో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. సెలబ్రిటీలు పాల్గొనే కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు పోలీసుల బాధ్యత ఎంత ఉంటుందో, నిర్వాహకుల బాధ్యత కూడా అంతే ఉంటుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ కేసులో కేవలం సెలబ్రిటీలను టార్గెట్ చేయడం వల్ల కేసు నిలబడలేక పోయిందని విశ్లేషిస్తున్నారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఇప్పుడు మరోసారి లోతైన దర్యాప్తు చేపట్టాల్సి ఉంటుంది. మరోవైపు మృతురాలి కుటుంబ సభ్యులు మాత్రం న్యాయం కోసం ఆందోళన చెందుతున్నారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన మహిళ కుటుంబానికి బాధ్యుల నుంచి నష్టపరిహారం అందాలని, కారకులకు శిక్ష పడాలని వారు కోరుతున్నారు. కోర్టులో జరుగుతున్న ఈ పరిణామాలు తమకు ప్రతికూలంగా మారుతాయేమోనని వారు భయపడుతున్నారు. పోలీసులు తమ దర్యాప్తును పకడ్బందీగా నిర్వహించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పౌర సమాజం కోరుతోంది.

ఈ ఇష్యూ ప్రస్తుతం సోషల్ మీడియాలో కూడా హాట్ టాపిక్ గా మారింది. నేటి తరం యువత ఈ కేసును నిశితంగా గమనిస్తోంది. సెలబ్రిటీల పబ్లిక్ అప్పీరెన్స్ సమయంలో భద్రతా ప్రోటోకాల్స్ ఎలా ఉండాలి? అభిమానుల ఉత్సాహానికి, ప్రాణాలకు ఉన్న విలువ ఎంత? అనే చర్చలు నడుస్తున్నాయి. సోషల్ మీడియాలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఈ కోర్టు తీర్పును స్వాగతిస్తుండగా, సామాన్యులు మాత్రం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.సినిమా పరిశ్రమలో ఇలాంటి ఘటనలు జరగడం కొత్తేమీ కాకపోయినా, పుష్ప2 వంటి భారీ చిత్రం విషయంలో ఇది జరగడం ఇండస్ట్రీని కుదిపేసింది. నిర్మాణ సంస్థలు కేవలం ప్రమోషన్ల మీద పెట్టే శ్రద్ధ, సామాన్యుల ప్రాణాల మీద పెట్టడం లేదని గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో కోర్టు తీసుకున్న నిర్ణయం వల్ల భవిష్యత్తులో ఇలాంటి పబ్లిక్ ఈవెంట్లకు సంబంధించిన నిబంధనలు మరింత కఠినతరం అయ్యే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.

హైదరాబాద్ పోలీసులు ఇప్పుడు మళ్ళీ మొదటి నుంచి ఈ కేసుపై కసరత్తు చేయాల్సి ఉంది. సాక్ష్యాలను క్రోడీకరించడం, ఫోరెన్సిక్ నివేదికలను సరిచూసుకోవడం, న్యాయస్థానం ఎత్తిచూపిన లోపాలను సవరించడం వారికి పెద్ద సవాల్ గా మారింది. పోలీసు ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి, తదుపరి అడుగులు వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ సారి ఛార్జ్‌షీట్‌ను అత్యంత పటిష్టంగా తయారు చేయాలని దర్యాప్తు అధికారులకు సూచనలు అందినట్లు సమాచారం. మొత్తానికి 'పుష్ప2' తొక్కిసలాట కేసు ఇటు సినిమా పరిశ్రమకు, అటు పోలీసు యంత్రాంగానికి ఒక పెద్ద గుణపాఠంలా మారింది. న్యాయస్థానంలో జరుగుతున్న ఈ పోరు ఎటు దారితీస్తుందో అన్నది వేచి చూడాలి. పోలీసులు తమ తదుపరి నివేదికలో ఎవరిని నిందితులుగా చూపిస్తారు? కోర్టు దానిని ఎలా స్వీకరిస్తుంది? అనేది తదుపరి విచారణలో తేలనుంది. అంతవరకు ఈ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది.

# ఇరాన్‌పై దాడికి అమెరికా సన్నద్ధం

**మొదటిపేజీ తరువాయి**

ఆకాశంలో గద్దల్లా పొంచి ఉన్న యుద్ధ విమానాలు, సముద్ర గర్భంలో తిష్టవేసిన నౌకలు యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. అమెరికా తన వాయుసేనలోని అత్యంత అధునాతనమైన F22 రాప్టర్, F35 లైట్నింగ్ II స్టెల్త్ యుద్ధ విమానాలను జోర్డాన్, సౌదీ అరేబియాలోని కీలక స్థావరాలకు చేరవేసింది. శత్రువుల రాడార్లకు చిక్కకుండా లోపలికి చొచ్చుకుపోయే సామర్థ్యం ఉన్న ఈ విమానాల మోహరింపు ఇరాన్ రక్షణ వ్యవస్థకు పెను సవాలుగా మారింది. వీటికి తోడుగా శత్రు విమానాలను వేటాడి వేటాడే F15 ఈగిల్, F16 ఫైటింగ్ ఫాల్కన్లు కూడా సిద్ధంగా ఉన్నాయి. ఇవన్నీ కేవలం ప్రదర్శన కోసం కాకుండా, అవసరమైతే క్షణాల్లో దాడికి దిగేలా సర్వసన్నద్ధంగా ఉండటం గమనార్హం. కేవలం యుద్ధ విమానాలే కాకుండా, యుద్ధ తంత్రాన్ని నడిపించే సపోర్టింగ్ వ్యవస్థను కూడా అమెరికా పకడ్బందీగా ఏర్పాటు చేసింది. గగనతల పర్యవేక్షణ కోసం E3 సెంట్రీ విమానాలు, యుద్ధ భూమిలో కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను అనుసంధానించే E11 బాటిల్‌ఫీల్డ్ నోడ్స్‌ను మోహరించారు. అలాగే ఆకాశంలోనే యుద్ధ విమానాలకు ఇంధనాన్ని నింపే కేసీ135 స్ట్రాటో ట్యాంకర్లు నిరంతరం నిఘా ఉంచుతున్నాయి. అంటే అమెరికా కేవలం మెరుపు దాడికి కాకుండా, సుదీర్ఘ కాలం పాటు యుద్ధం కొనసాగించే భారీ వ్యూహంతోనే ముందడుగు వేస్తోందని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు సముద్ర తీరంలోనూ అమెరికా నౌకాదళం తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తోంది. ఇప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న యుఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌకకు తోడుగా, ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన యుఎస్ఎస్ గెరార్డ్ ఫోర్డ్ కూడా చేరింది. ఈ నౌకలపై వందలాది యుద్ధ విమానాలు సిద్ధంగా ఉండటమే కాకుండా, వీటి రక్షణ కోసం బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకునే సామర్థ్యం ఉన్న విధ్వంసక



నౌకలు కూడా కంచుకోటలా ఉన్నాయి. ఈ స్థాయి నావిక సమీకరణ గతంలో 2003 ఇరాక్ యుద్ధ సమయంలో మాత్రమే కనిపించింది.

ప్రస్తుత సైనిక బలగాల సంఖ్య 1991 గల్ఫ్ యుద్ధం నాటి స్థాయిలో లేకపోయినా, సాంకేతిక పరంగా అమెరికా ఇప్పుడు మరింత బలపడిందని చెప్పాలి. అప్పట్లో వేలాది విమానాలు అవసరమైన పనులను, ఇప్పుడు కొన్ని వందల అత్యాధునిక విమానాలే పూర్తి చేయగలవు. ఖచ్చితత్వంతో కూడిన దాడులు నిర్వహించడంలో అమెరికా ఇప్పుడు అగ్రస్థానంలో ఉంది. ఇరాన్ యొక్క అణు కేంద్రాలు మరియు క్షిపణి స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ మోహరింపు జరుగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ భారీ సైనిక విన్యాసాల వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ విషయంలో ఇంకా తుది నిర్ణయం ప్రకటించలేదు. ఇరాన్‌ను చర్చల మేడకు రప్పించడానికి, వారిపై మానసిక ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగానే ఈ బలగాల మోహరింపు జరిగిందా అనే కోణం కూడా వినిపిస్తోంది. ఒకవేళ ఇరాన్ మెత్తబడకపోతే, నేరుగా దాడి చేసే అవకాశం లేకపోలేదని శ్వేతసౌధం వర్గాల సమాచారం ద్వారా తెలుస్తోంది. ఇదే సమయంలో జెనీవాలో అమెరికా మరియు ఇరాన్ ప్రతినిధుల మధ్య దౌత్యపరమైన చర్చలు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. కొన్ని అంశాల్లో అంగీకారం కుదిరినప్పటికీ, ఇరాన్ అణు కార్యక్రమంపై ఇంకా ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. చర్చలు ఒకవైపు, యుద్ధ సన్నద్ధత మరోవైపు సాగుతుండటంతో ప్రపంచం ఊపిరి బిగబట్టి చూస్తోంది. ఈ దౌత్య యుద్ధంలో గెలిచేది ఎవరో, ఓడేది ఎవరో అన్నది మరికొద్ది గంటల్లోనే తేలే అవకాశం ఉంది. యుద్ధం జరిగితే అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇరాన్ కూడా అమెరికా హెచ్చరికలకు వెనక్కి తగ్గడం లేదు. తమ భూభాగంపై దాడి జరిగితే తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరిస్తోంది. ముఖ్యంగా ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేస్తామన్న ఇరాన్ హెచ్చరికలు పెట్రోల్ ధరలపై ప్రభావం చూపవచ్చు. ఇరాన్ దగ్గర ఉన్న భారీ క్షిపణి వ్యవస్థ మరియు ప్రాంతీయ మిత్ర బలగాలు అమెరికా స్థావరాలపై దాడులు చేసే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్లిష్ట పరిస్థితుల్లో అగ్రరాజ్యాల నిర్ణయం ఎలా ఉంటుందోనని ఐక్యరాజ్యసమితితో సహా పలు దేశాలు ఆందోళన చెందుతున్నాయి. యుద్ధం అనేది ఎప్పుడూ వినాశనానికే దారితీస్తుందని, దౌత్య పరంగా సమస్యను పరిష్కరించుకోవాలని రష్యా, చైనా వంటి దేశాలు సూచిస్తున్నాయి. కానీ ఇరాన్ దూకుడును అడ్డుకోవాలంటే సైనిక చర్యే సరైన మార్గమని అమెరికాలోని ఒక వర్గం గట్టిగా నమ్ముతోంది. ఈ ఉద్రిక్తతలు చివరకు ఎటు దారి తీస్తాయో అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. మొత్తానికి మధ్యప్రాచ్యం ఇప్పుడు ఒక పేలుడు పదార్థాల గుట్టలా మారింది. చిన్న నిప్పురవ్వ తగిలినా అది భారీ యుద్ధానికి దారితీసేలా ఉంది. ట్రంప్ తుది సంతకం కోసం పెంటగాన్ ఎదురుచూస్తుండగా, ఇరాన్ కూడా తన ప్రతిఘటనకు పదును పెడుతోంది.

# ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం

**చర్ల, విశాలభారతి:**

చర్ల మండల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కన్వీనర్ దొడ్డి తాతారావు గారి అధ్యక్షతన జరిగింది సమావేశానికి ముఖ్య అతిథిలు భద్రాచలం నియోజకవర్గం సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్,మానే రామకృష్ణ హాజరై మాట్లాడుతూ ..రేపు రాబోయే ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మాయమాటలు చెప్పి ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేసి గద్దెనెక్కి రెండున్నర సంవత్సరాలు అవుతున్న ఈరోజుకి ఏ ఒక్క హామీ కూడా సరిగ్గా అమలు చేయలేదని అన్నారు,అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తెల్లం వెంకట్రావుని గెలిపిస్తే అభివృద్ధి పేరుతో గెలిపించిన కార్యకర్తలను మోసం చేసి పార్టీ మారిన వెంకట్రావు భద్రాచలం నియోజకవర్గం లో ఏమీ అభివృద్ధి చేశారో చూపించాలని ఆయన వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే కుటుంబం అభివృద్ధి చెందింది తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని అన్నారు.ఈ కార్యక్రమం లోకో కన్వీనర్ పవన్ కుమార్ ,పార్టీ సీనియర్ నాయకులు కాకి అనిల్ పంజా రాజు ,దినసరపు భాస్కర్ రెడ్డి ,గోరింట్ల వెంకటేశ్వరరావు,తడికల బుల్లెబ్బాయి, కారం కన్నారావు బొజ్జ బాచి ,నాగరాజు ,సంతపూరి సతీష్ ,అంబోజి సతీష్, కనుకు భద్రం ,వంకాయల కృష్ణ ,పాగా రాంప్రసాద్ , ఆర్ఎంపి రాజు, గాదంశెట్టి కిషోర్ ,బట్ట కొమరయ్య , గుమ్మల నరేంద్ర ,చిన్నుమల్ల వంశి ,మరియు పార్టీ సర్పంచులు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



# 'కత్తులు, కటార్లతో కాదు చేతులతో చంపేస్తా'

**మొదటిపేజీ తరువాయి**

పక్కన పెట్టి రావాలని డిమాండ్ చేశారు. తను కూడా ఎటువంటి భద్రత లేకుండా ఒంటరిగా వస్తానని, అప్పుడు తేల్చుకుందామని ప్రకటించారు. యుద్ధం చేయడానికి కత్తులు, గన్లు వంటి ఆయుధాలు కూడా అవసరం లేదని, కేవలం వట్టి చేతులతోనే ఐదు నిమిషాల్లో నీ సామర్థ్యం ఏంటో చూపిస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సవాల్ ఇప్పుడు రెండు వర్గాల మధ్య సోషల్ మీడియా వేదికగా పెద్ద చర్చకు దారితీసింది. సవాల్ విసరడమే కాకుండా వేదిక, సమయం వంటి వివరాలను కూడా ప్రత్యర్థికే వదిలేశారు రాజాసింగ్. డేట్, టైమ్, ప్లేస్ ఏదైనా సరే.. అన్నీ ఓవైసీనే నిర్ణయించవచ్చని, తను ఎక్కడికైనా రావడానికి సిద్ధంగా ఉన్నానని కుండబద్దలు కొట్టారు. కేవలం పాతబస్తీ గల్లీల్లో కూర్చుని మాట్లాడటం కాకుండా, నిజమైన మగతనం ఉంటే బయటకు వచ్చి తలపడాలని ఆయన రెచ్చగొట్టేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో హైదరాబాద్ రాజకీయాల్లో ఎటువంటి పరిణామాలకు దారితీస్తాయో అన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఓవైసీ సోదరుల రాజకీయ శైలిపై కూడా రాజాసింగ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. వారి రాజకీయాలు కేవలం పాతబస్తీకే పరిమితమయ్యాయని, అక్కడి నుండి బయటకు వచ్చి పోటీ చేసే ధైర్యం వారికి లేదని మండిపడ్డారు. ముస్లిం ఓటు బ్యాంక్‌ను అడ్డం పెట్టుకుని హిందువులపై విషం చిమ్మడమే పనిగా పెట్టు



కున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ సమాజాన్ని కించపరిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, ప్రతి మాటకూ ప్రతిదాడులు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఛత్రపతి శివాజీ ఆశయాలతో ముందుకు సాగే సైనికులెవరూ పిరికివారు కారని గుర్తు చేశారు.

రాజాసింగ్ చేసిన ఈ ప్రసంగం సభలో ఉన్న యువతను విశేషంగా ఆకట్టుకుంది. ఆయన మాట్లాడుతున్నంత సేపు 'జై శ్రీరామ్' నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగిపోయింది. ముఖ్యంగా అక్బరుద్దీన్ ఓవైసీని ఉద్దేశించి చేసిన సవాల్ వీడియో క్లిప్పులు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థుల మధ్య వ్యక్తిగత విమర్శలు సర్వసాధారణమే అయినా, ఇలా నేరుగా 'చంపేస్తా' అనే స్థాయికి వ్యాఖ్యలు వెళ్లడం తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతోంది. పోలీసులు ఈ వ్యవహారంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గత కొన్నేళ్లుగా రాజాసింగ్, ఓవైసీ సోదరుల మధ్య మాటల యుద్ధం నడుస్తూనే ఉంది. అయితే ఈసారి రాజాసింగ్ తన స్వరాన్ని మరింత పెంచినట్లు కనిపిస్తోంది. కేవలం రాజకీయ విమర్శలతో ఆగకుండా, భౌతిక దాడుల ప్రస్తావన తీసుకురావడం గమనార్హం. గతంలో అక్బరుద్దీన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు ప్రతిగా ఇప్పుడు అదే స్థాయిలో కౌంటర్ ఇవ్వాలని రాజాసింగ్ నిర్ణయించుకున్నట్లు ఆయన మాటలను బట్టి అర్థమవుతోంది. హిందూ ధర్మం కోసం పోరాడే క్రమంలో ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని ఆయన పునరుద్ఘాటించారు.

తెలంగాణలో శాంతిభద్రతల దృష్ట్యా ఇటువంటి వ్యాఖ్యలు సమర్థనీయం కావని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒక ప్రజాప్రతినిధి అయి ఉండి బహిరంగంగా ఐదు నిమిషాల్లో తేల్చేస్తానని చెప్పడం రాజ్యాంగబద్ధం కాదని విమర్శలు వస్తున్నాయి. అయితే రాజాసింగ్ మద్దతుదారులు మాత్రం, గతంలో ఓవైసీ చేసిన వ్యాఖ్యలకు ఇది సరైన సమాధానమని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. హిందువులను రెచ్చగొట్టినప్పుడు ఎవరూ నోరు మెదపలేదని, ఇప్పుడు రాజాసింగ్ అడిగితే తప్పేంటని వారు ప్రశ్నిస్తున్నారు.

మరోవైపు, ఎంఐఎం వర్గాల నుండి ఈ వ్యాఖ్యలపై ఇంకా అధికారిక స్పందన రావాల్సి ఉంది. సాధారణంగా రాజాసింగ్ చేసే విమర్శలను ఓవైసీ సోదరులు పట్టించుకోనట్లు నటిస్తుంటారు, కానీ ఈసారి 'ఐదు నిమిషాల' ఛాలెంజ్ గట్టిగా ఉండటంతో వారు ఎలా స్పందిస్తారో చూడాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హిందూ సంఘాలు రాజాసింగ్ వ్యాఖ్యలకు మద్దతు తెలుపుతుండగా, మైనారిటీ నాయకులు మాత్రం ఇలాంటి రెచ్చగొట్టే ప్రసంగాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనివల్ల రాష్ట్రంలో మతపరమైన ఉద్రిక్తతలు చోటు చేసుకునే అవకాశం ఉందని భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి.

మొత్తానికి, వరంగల్ వేదికగా రాజాసింగ్ చేసిన ఈ ప్రసంగం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టించింది. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా, ఇలాంటి ఉత్సవాల్లో కూడా రాజాసింగ్ తన దూకుడును ప్రదర్శిస్తుండటం విశేషం. శివాజీ మహారాజ్ స్ఫూర్తితో హిందూ యువత ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వివాదం ఇక్కడితో ఆగుతుందా లేక పాతబస్తీ వర్సెస్ గోషామహల్ అన్నట్లుగా మరింత ముదురుతుందా అనేది వేచి చూడాలి. రాబోయే రోజుల్లో ఈ వ్యాఖ్యల చుట్టూ రాజకీయాలు మరిన్ని మలుపులు తిరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

# రెండు లవంగాలు నమలండి

**మొదటిపేజీ తరువాయి**

ఆరోగ్యమస్తు: మన వంటింట్లో లభించే సుగంధ ద్రవ్యాల్లో లవంగాలు ప్రత్యేకమైనవి. కేవలం రుచి కోసం మాత్రమే కాకుండా, పురాతన కాలం నుండి ఆయుర్వేదంలో లవంగాలను దివ్యౌషధంగా వాడుతున్నారు. ముఖ్యంగా ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు రెండు లవంగాలను నమలడం వల్ల శరీరానికి కలిగే ప్రయోజనాలు తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. నేటి తరం ఎదుర్కొంటున్న అనేక జీవనశైలి సమస్యలకు లవంగం ఒక సహజమైన పరిష్కారంగా మారుతోంది. రాత్రిపూట గోరువెచ్చని నీటితో కలిపి వీటిని తీసుకోవడం వల్ల రెట్టింపు ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత కాలంలో చాలామందిని వేధిస్తున్న ప్రధాన సమస్య జీర్ణక్రియ. రాత్రి భోజనం తర్వాత లవంగాలు నమలడం వల్ల లాలాజలం ఉత్పత్తి పెరిగి, ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. ఇది గ్యాస్, ఎసిడిటీ , మలబద్ధకం వంటి ఇబ్బందులను సమర్థవంతంగా నివారిస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపి, పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో లవంగాలు అద్భుతంగా పనిచేస్తాయి. పొట్ట ఉబ్బరం సమస్యతో బాధపడేవారికి ఇది ఒక సులభమైన ఇంటి చిట్కా అని చెప్పవచ్చు. లవంగాల్లో యాంటీ ఆక్సిడెంట్లతో పాటు విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇవి శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచి, రోగ నిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. మారుతున్న వాతావరణం వల్ల వచ్చే జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ పొందడానికి రాత్రిపూట లవంగాలు తీసుకోవడం ఎంతో మేలు చేస్తుంది. శరీరంలోని హానికరమైన బ్యాక్టీరియాను సంహరించే శక్తి వీటికి ఉంది. వైరల్ ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఉండాలంటే లవంగాన్ని క్రమం తప్పకుండా వాడటం మంచిది.



దంత సమస్యలకు లవంగం ఒక రామబాణం. రాత్రిపూట లవంగాలు నమలడం వల్ల నోటిలోని బ్యాక్టీరియా నశిస్తుంది. ఇది పిప్పి పన్ను నొప్పి, చిగుళ్ల వాపు మరియు నోటి దుర్వాసనను తగ్గిస్తుంది. దంతాల ఆరోగ్యాన్ని కాపాడటంలో లవంగం నూనె ఎంత ప్రభావవంతమో, నేరుగా లవంగాలు నమలడం కూడా అంతే మేలు చేస్తుంది. ఉదయాన్నే నోరు తాజాగా ఉండటంతో పాటు చిగుళ్లు బలంగా తయారవుతాయి. నోటి క్యాన్సర్ వంటి ముప్పులను నివారించడంలోనూ ఇది తోడ్పడుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

డయాబెటిస్ ఉన్నవారికి లవంగాలు ఒక వరం. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి, గ్లూకోజ్ స్థాయిలను సమతుల్యం చేస్తాయి. రాత్రిపూట వీటిని తీసుకోవడం వల్ల రక్తంలోని అదనపు చక్కెర నియంత్రణలో ఉంటుంది. అలాగే, కాలేయ పనితీరును మెరుగుపరచడంలో కూడా లవంగాలు కీలక పాత్ర పోషిస్తాయి. రక్త శుద్ధికి మరియు గుండె ఆరోగ్యానికి ఇవి ఎంతో తోడ్పడతాయి. నేటి బిజీ లైఫ్ స్టైల్‌లో ఒత్తిడి అనేది సాధారణమైపోయింది. లవంగాల్లో ఉండే యుజినాల్ అనే పదార్థం మెదడును ప్రశాంతంగా ఉంచుతుంది. రాత్రి పడుకునే ముందు లవంగం తీసుకోవడం వల్ల మనసు తేలికపడి, ఒత్తిడి తగ్గుతుంది. తద్వారా నిద్రలేమి సమస్య దూరమై గాఢ నిద్ర పడుతుంది. మానసిక ప్రశాంతతను కోరుకునే వారు ఈ చిన్న మార్పుతో తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. హార్మోన్ల సమతుల్యతకు కూడా ఇది ఎంతో అవసరం. ఎముకల పుష్టికి కూడా లవంగాలు ఎంతగానో ఉపయోగపడతాయి. వీటిలో ఉండే మాంగనీస్ ఎముకల సాంద్రతను పెంచుతుంది. వయసు పెరిగే కొద్దీ వచ్చే కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందడానికి లవంగాలు తోడ్పడతాయి. ఆర్థరైటిస్ సమస్య ఉన్నవారు రాత్రిపూట లవంగాలు తీసుకోవడం వల్ల వాపులు తగ్గే అవకాశం ఉంది. ఎముకల నిర్మాణానికి అవసరమైన ఖనిజాలను శరీరానికి అందించడంలో ఇది ముందుంటుంది. చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో లవంగాలు అద్భుతమైన యాంటీ ఏజింగ్ ఏజెంట్ గా పనిచేస్తాయి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపై ముడతలు, మచ్చలను తగ్గిస్తాయి. రక్తాన్ని శుద్ధి చేయడం ద్వారా చర్మం కాంతివంతంగా మారుతుంది. మొటిమల సమస్యతో బాధపడేవారికి కూడా ఇది ఉపశమనాన్ని ఇస్తుంది. కేవలం లోపలి ఆరోగ్యం మాత్రమే కాకుండా, బాహ్య సౌందర్యాన్ని పెంచడంలో కూడా లవంగం తనదైన ముద్ర వేస్తోంది.

# గురుకులాల బాగుపై సర్కార్ నజర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాల రూపురేఖలను మార్చడంతో పాటు, అక్కడ చదువుకుంటున్న విద్యార్థుల సంక్షేమంపై రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడమే లక్ష్యంగా పాలనా యంత్రాంగం సరికొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. గతంలో జరిగిన కొన్ని చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా నిరంతర నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించడమే కాకుండా, ఇందుకోసం ఒక పక్కా యంత్రాంగాన్ని సిద్ధం చేసింది. కేవలం కాగితాల మీద తనిఖీలు కాకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించింది. ఈ అధికారులు గురుకులాల పనితీరును, విద్యార్థులకు అందుతున్న ఆహార నాణ్యతను, వసతి సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. దీనివల్ల అధికారుల్లో జవాబుదారీతనం పెరగడంతో పాటు విద్యార్థులకు మెరుగైన సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి జిల్లాకు సంబంధించి ఒక నిర్దిష్టమైన తనిఖీ షెడ్యూల్ అమలులోకి రానుంది. ఈ మేరకు 'డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్'ను సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. ఈ క్యాలెండర్ ప్రకారం ఏ అధికారి ఏ రోజు ఏ పాఠశాలను సందర్శించాలో ముందుగానే ఖరారు చేస్తారు. దీనివల్ల తనిఖీ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా, అన్ని పాఠశాలలను కవర్ చేసే అవకాశం ఉంటుంది. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ఈ తనిఖీల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగాలని ప్రభుత్వం ఆశిస్తోంది.



కేవలం ముందస్తు సమాచారం ఇచ్చి వచ్చే సందర్శనలే కాకుండా, ఆకస్మిక తనిఖీలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. అధికారులు ముందస్తు సమాచారం లేకుండానే పాఠశాలలను సందర్శించి అక్కడ అమలవుతున్న విద్యా ప్రమాణాలను, వంట గదులను, విద్యార్థుల నివాస గదులను పరిశీలిస్తారు. ఇలాంటి మెరుపు దాడుల వల్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండటమే కాకుండా, నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు సాగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కూడా ప్రభుత్వం వెనుకాడబోమని హెచ్చరించింది. తనిఖీల అనంతరం నివేదికలు పంపడంలో గతంలో ఉన్న జాప్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం టెక్నాలజీని వాడుకుంటోంది. తనిఖీ చేసిన వెంటనే ఆ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించింది. ఇలా చేయడం వల్ల ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల స్థితిగతులను డాష్‌బోర్డ్ ద్వారా గమనించే అవకాశం ఉంటుంది. ఏదైనా సమస్య తలెత్తితే తక్షణమే పరిష్కరించేలా వేగవంతమైన చర్యలు తీసుకోవడానికి ఈ డిజిటల్ రిపోర్టింగ్ వ్యవస్థ ఎంతగానో దోహదపడనుంది.

ప్రతి నెలా 5వ తేదీలోపు తనిఖీ నివేదికలను సమర్పించడం ఇప్పుడు తప్పనిసరి అయింది. ఈ గడువును పాటించని అధికారులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తనిఖీల సమయంలో ఏవైనా లోపాలు కనిపిస్తే వాటిని వెంటనే సరిదిద్దడంతో పాటు, తీసుకున్న చర్యల వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలి. దీనివల్ల సమస్యల పరిష్కారంలో వేగం పెరుగుతుంది. కేవలం సమస్యలను గుర్తించడమే కాకుండా, వాటిని పరిష్కరించడంలో అధికారుల చొరవను కూడా ప్రభుత్వం లెక్కించనుంది. ముఖ్యంగా విద్యార్థులకు అందించే ఆహార విషయంలో ప్రభుత్వం సున్నా సహన విధానాన్ని అవలంబిస్తోంది. డైట్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా లేదా అన్నది నిరంతరం తనిఖీ చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. తనిఖీ సమయంలో విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని, వారు చెప్పే ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే నివేదికలు తయారు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనివల్ల విద్యార్థులకు పరిపాలనపై నమ్మకం కలగడమే కాకుండా, వారి ఆరోగ్యం పట్ల భరోసా కలుగుతుంది. ఈ కొత్త యాక్షన్ ప్లాన్ ద్వారా గురుకులాల్లో క్రమశిక్షణతో కూడిన విద్యా బోధనను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఉపాధ్యాయుల హాజరు, బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యసన స్థాయిలను మెరుగుపరిచేందుకు కూడా ఈ తనిఖీలు ఉపయోపడతాయి. గురుకులాలు అంటే కేవలం బస చేసే కేంద్రాలుగా కాకుండా, అత్యున్నత ప్రమాణాలు గల విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాలన్నది రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. దీనికోసం అవసరమైన నిధులను విడుదల చేసేందుకు కూడా సర్కార్ వెనుకాడడం లేదు. తెలంగాణ గురుకులాల పర్యవేక్షణలో ఈ మార్పులు ఒక విప్లవాత్మకమైన అడుగుగా భావించవచ్చు. నిరంతర పర్యవేక్షణ, జవాబుదారీతనం, సాంకేతికత వినియోగం వంటి అంశాలు గురుకుల విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయి. రాష్ట్రంలోని వేలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాలు క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విశాల భారతి

## కౌన్సిలర్ వాణి విప్లవ్ గౌడ్ ప్రమాణస్వీకారం

- వార్డు అభివృద్ధికి కృషి చేస్తా
- ఇంద్రమ్మ ఇల్లు ప్రారంభోత్సవం



**చౌటుప్పల్, విశాలభారతి:** మున్సిపల్ కార్యాలయంలో 13వ వార్డు కౌన్సిలర్‌గా బత్తుల వాణి విప్లవ్ గౌడ్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు.వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ గౌడ్ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వరకు చేరవేసేలా కృషి చేస్తానని కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసిన ఆమె 13వ వార్డులో కరంటోతు భాను ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు.దశల వార్ల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు అభిమానులు స్థానిక వార్డు ప్రజలు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు.మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,మున్సిపాలిటీ ఇన్చార్జి బాలు మహేంద్ర, నాయకులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, జైపాల్ రెడ్డి తదితరులు ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ..13వ వార్డు అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్ చురుకుగా వ్యవహరించాలని సూచించారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అకాడమిక్ పరిశీలన



**ఆదిలాబాద్, విశాలభారతి:** ఎస్ఏస్ఏ అసిఫాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, ఆదిలాబాద్‌లో అకాడెమిక్ పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంఓగా వ్యవహరిస్తున్న బి. లక్ష్మణ్, అసిస్టెంట్ ఏఎంఏ అజయ్ పాఠశాల నిర్వహణ, బోధనా విధానాలపై సమగ్రంగా పరిశీలన చేపట్టారు. తరగతి గదుల్లో జరుగుతున్న బోధనను ప్రత్యక్షంగా వీక్షించిన అధికారులు, ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల బోధనలో మరింత నాణ్యత సాధించేందుకు అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని పెంపొందించేందుకు అనుసరించాల్సిన విధానాలపై మార్గదర్శకాలు అందించారు. అదేవిధంగా పాఠశాల వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించి పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పాఠశాల నిర్వహణ, క్రమశిక్షణ, విద్యా ప్రమాణాల పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బంది కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ప్రశాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు రవికాంత్ రెడ్డి, గణేష్, హారిక పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన వలిగొండ నాయకులు



**వలిగొండ, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలానికి చెందిన నాయకులు ఆలేరు నియోజకవర్గ ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వలిగొండ మండలం కురుమ సంఘం అధ్యక్షులు కునపురి శంకర్, నాతాలగూడెం మాజీ సర్పంచ్ ఉలిపే మల్లేశం ఎమ్మెల్యే గారిని శాలువాతో సన్మానించారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం వంటి పలు అంశాలపై ఎమ్మెల్యే గారితో నాయకులు చర్చించారు.

## నేటి యువతకు చత్రపతి శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం

- ఇ.ఎల్.వి.భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్



**చౌటుప్పల్, విశాలభారతి:** చత్రపతి శివాజీ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీల పట్ల గౌరవం, ధర్మం పట్ల నిబద్ధత,నిరుపేదల సంక్షేమం కోరుకునే ఆయన గుణాలను నేటి యువత జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.యువత చేడు వ్యసనాలకు దూరంగ ఉండి శివాజీ వంటి గొప్ప మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని, విద్య ,నైపుణ్యాల వైపు అడుగులు వేయాలన్నారు.

## నిరుద్యోగ యువత వ్యాపారాలను ప్రారంభించాలి

- ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్



**చౌటుప్పల్, విశాలభారతి:** నిరుద్యోగ యువత పట్టుదలతో చిన్న చిన్న వ్యాపారాలను ప్రారంభించి, ఆర్థికంగా ఎదగడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అన్నారు.శుక్రవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎం.వి. హెయిర్ స్టూడియో'ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.వి. హెయిర్ స్టూడియో యజమానిని అభినందించి ప్రోత్సాహకంగా 25 వేల రూపాయలను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ ఫౌండేషన్ ద్వారా సామాజిక బాధ్యతలో భాగంగా యువతకు, పేదలకు నిరంతరం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించడం ద్వారా సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు. విద్యతో పాటు, వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు.విద్య, వైద్యం, ఉపాధి అందరికి లభించినప్పుడే సమాజం బాగుపడుతుందన్నారు. స్వయం ఉపాధి కోసం కష్టపడే వారికి తమ వంతు సాయాన్ని ఎప్పుడూ అందిస్తూనే ఉంటామని తెలిపారు.


## రూ 2.50 లక్షల ఎల్ ఓ సి అందించిన పివిఆర్



**నిజామాబాద్, విశాలభారతి:** మండలంలోని గోవింద్ పెట్ గ్రామనికి చెందిన రోహిత్ రానా 14 సంవత్సరాల బాలుడు ఇటీవలే అనారోగ్యం తో బాధపడుతూ మెరుగైన వైద్యం కొరకు హైదరాబాదులోని నీమ్స్ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ 2.50 లక్షల ఎల్ ఓ సి చెక్కును బాధిత కుటుంబాలకు శుక్రవారం అందించారు. బాధిత కుటుంబ సభ్యులుసీఎం ఎనుముల రేవంత్ రెడ్డి. మంత్రి సీతక్క. సీఎం ముఖ్య సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డికి. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వినయ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు

# భవిత కేంద్రాల నిర్వహణ మరింతగా మెరుగుపడాలి

- మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్ష




**నిజామాబాద్, విశాలభారతి:** ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, భవిత కేంద్రాల నిర్వహణ తీరుతెన్నులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి మండల ప్రత్యేక అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారీగా స్పెషల్ ఆఫీసర్లు జరిపిన క్షేత్రస్థాయి సందర్శనలు, ఆయా పాఠశాలల్లో వారు గమనించిన అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా స్కూళ్ళలో నెలకొని ఉన్న స్థితిగతులు, పెండింగ్ పనులు, ఎం.ఎస్.ఓ లు సందర్శించిన దృశ్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి పరిశీలనలు కొనసాగించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఎంఎస్ఓ లకు ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల నిర్వహణ మరింతగా మెరుగుపడాలని, వివిధ దశలలో నిర్మాణాలలో ఉన్న కేంద్రాల పనులను వేగంగా పూర్తి చేయించాలని సూచించారు. మంజూరీలు తెలుపబడిన అన్ని పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు గడువు విధించారు. రెసిడెన్షియల్ స్కూల్స్, వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం మెనూ ప్రకారం అందుతుందా లేదా అన్నది పరిశీలించాలని, మెనూ పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. కలుషిత ఆహారం వంటివి చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేజీబీవీలు సహా అన్ని బాలికల విద్యాలయాల్లో సీ.సీ టీ.వీలు వర్కింగ్ కండీషన్ లో ఉండాలని, అవసరమైన చోట వెంటనే మరమ్మతులు చేయించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, భద్రతకు ఎనలేని ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. సమావేశంలో డీఆర్డీఓ సాయాగౌడ్, డీఈఓ అశోక్, ఆర్.సీ.ఓలు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఆస్థి కోసం సహోదరునిపై హత్య ప్రయత్నం చేసిన అన్న


- తెల్లవారుజామున కత్తితో దాడి .ముగ్గురికి తీవ్ర గాయాలు
- నిందితున్ని అరెస్ట్ చేసిన గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు



**విశాలభారతి, గోదావరిఖని:** గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి మార్కండేయ కాలనీలో రెండు కుటుంబాల మధ్య ఆస్థి, ఇతర వివాదాల కారణంతో కత్తి తో దాడి చేసి హత్యాయత్నం కి పాల్పడిన నిందితుని అరెస్ట్ వివరాలు ఏసీపీ కార్యాలయంలో గోదావరిఖని ఏసిపి ఎం రమేష్,గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి కలిసి అరెస్ట్ వివరాలు వెల్లడించారు.నిందితుడు గాడిచెర్ల రామ్ దూత్, 27 yrs, బిటెక్ చదివి ప్రస్తుతం సోరియాసిస్ చర్మ వ్యాధితో ఇంట్లోనే ఉంటున్నాడు. నిందితుని తాత రాయమల్లు కట్టించిన ఇంటిలో పెద్ద కుమారుడు సారయ్య కుటుంబం ఒక భాగంలో ఉండగా, చిన్న కుమారుడు శ్రీనివాస్ కుటుంబం మరో భాగంలో ఇద్దరు కుమారుల పక్కపక్కనే చెరో భాగంలో నివసిస్తున్నారు. శ్రీనివాస్ పదకొండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య సుమిత్రి, కుమారుడు ప్రణయ్ (22), కుమార్తె సువర్ళలా, సుమిత్రి తల్లి కొమురమ్మ అక్కడే ఉంటున్నారు. నిందితుడు రామ్ దూత్ తండ్రికి ఫిట్స్, బీపీ సమస్యలు ఉండగా, తల్లికి గుండె సమస్యలు ఉన్నాయి. పిన్ని సుమిత్ర కిరాణా దుకాణంలో సిగరెట్లు, గుట్కా, పాన్ మసాలా అమ్ముతుండగా, వాటి వాసన మరియు సిగరేటు అక్కడే త్రాగడం వల్ల వచ్చే పొగ కారణంగా తమ ఆరోగ్యం దెబ్బతింటోందని రామ్ దూత్ కుటుంబం పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయంపై తరచూ గొడవలు జరిగాయి.అదేవిదంగా నిందితుని రామ్ దూత్ తండ్రి, చిన్న నాన్న (బాబాయ్ ) కుటుంబ ఆస్తి తనకే వస్తుందని భావించి బాబాయ్ కుటుంబ సభ్యులను చంపాలని రామ్ దూత్ నిర్ణయించుకొని, గత సంవత్సరం అక్టోబర్ 5న అమెజాన్ ద్వారా కొబ్బరి కత్తి కొనుగోలు చేసి ఇంట్లో దాచుకున్నాడు. హత్యకు గల కారణాలను ఒక నోటు బుక్కులో కూడా రాసుకున్నాడు. నిందితుని పథకంలో భాగంగా ఈరోజు తేది 20022026 తెల్లవారు జామున సుమారు ఉదయం 5 గంటల సమయంలో, పిన్ని సుమిత్ర నిద్ర లేచి , తలుపులు తీసి , బాత్రూంకు వెళ్లగా రామ్ దూత్ కత్తితో పక్కింట్లోని బాబాయ్ ఇంటికి వెళ్లి పడుకుని ఉన్న ప్రణయ్పై ఛాతీ, భుజాలు, మెడపై దాడి చేశాడు. అరుపులు విని అడ్డుకున్న కొమురమ్మకు ముఖం, చెవి, చేతిపై గాయాలు అయ్యాయి. తరువాత సుమిత్రిపై కూడా ముఖం, చేతులపై కత్తితో దాడి చేసి తీవ్ర గాయాలు చేశాడు . అరుపులు విని అక్కడికి వచ్చిన చుట్టూ ప్రక్కన వ్యక్తులు నిందితుడిని అడ్డుకుని కత్తి లాక్కొన్నారు. దాడి సమయంలో బట్టలపై రక్తం పడటంతో బట్టలు మార్చుకుని రామ్ దూత్ ఇంటి నుండి పారిపోయాడు. వారిని మొదటగా గోదావరిఖని గవర్నమెంట్ హాస్పిటల్ కు తర్వాత కరీంనగర్ వన్ హాస్పిటల్ కు తీసుకుపోయి అడ్మిట్ చేశారు .నిందితుడు ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ వద్ద దాక్కొని బస్ స్టాండ్కు వెళ్తున్నాడు అనే నమ్మదగిన సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ ఇంద్రాసేనా రెడ్డి, అక్కడకి వెళ్లి నిందితుడిని పట్టుకొని అదుపులోకి తీసుకోని పోలీస్ స్టేషన్ తరలించి అరెస్ట్ చేసి కోర్ట్ లో హాజరు పరిచి రిమాండ్ కి తరలించడం జరిగింది అని ఏసీపీ తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లు" పనులపై విస్తృత పర్యటన

- నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు



**వలిగొండ , విశాలభారతి:** మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలేందర్ రెడ్డి గారు నాగారం గ్రామపంచాయతీని ఉదయం 9 గంటల నుండి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్శనలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్ యం.డి. సాలేహా గారు మరియు గ్రామపంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఇందిరమ్మ ఇళ్లు" నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. గ్రామంలో మంజూరైన 25 ఇళ్లలో ఇంకా నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న సుమారు 22 ఇళ్ల పనులను పరిశీలించి, ఖర్చు రూ. 5 లక్షలు మించకుండా ప్రభుత్వం నిర్ణయించిన పరిమితిలోనే నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకు మించి కాంట్రాక్టర్లు ఎటువంటి అదనపు మొత్తాలు వసూలు చేయరాదని కఠినంగా హెచ్చరించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి హాజరు పట్టికలు, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అందుబాటులో ఉన్న ఔషధాల నాణ్యతపై విచారించారు. తదుపరి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించి కార్యక్రమం అమలు పురోగతిపై ఆరా తీశారు.నర్సరీ కేంద్రంలో మొక్కల సంఖ్య, వాటి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి ఆదేశించారు. వారానికి ఒకసారి నివేదిక సమర్పించాలని సూచించారు. అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ మరియు ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. గర్భిణీ స్త్రీలతో మాట్లాడి వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతపై విచారించి, వారి ఆరోగ్య అవసరాల మేరకు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రోజూ అంగన్‌వాడి కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. చివరగా గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి అన్ని రికార్డులు ఎప్పటికప్పుడు నవీకరించబడుతూ ఉండాలని సిబ్బందికి ఆదేశించారు.


## ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం

- ప్రమాదంలో ధార పవన్ (35) కెమిస్ట్ మృతి



**చౌటుప్పల్, విశాలభారతి:** భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలో విజయ సాయి ఫార్మ కంపెనీలో జరిగిన అగ్నిప్రమాదం.ఈ ప్రమాదంలో దారా పవన్ (35) కెమిస్ట్రీ కెమికల్ డ్రమ్ములు నుండి రియాక్టర్ లోడ్ చేస్తుండగా అదే సమయంలో కెమికల్ రియాక్షన్ కావడం తో పేలి డ్రమ్ము మంటల్లో వ్యక్తి పూర్తిగా దగ్ధం ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. తరచూ ప్రమాదాలు జరుగుతున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కానీ స్పందించడం లేదని గతంలో బృందావనం ఫార్మా పరిశ్రమంలో జరిగిన ప్రమాదం మరువకముందే విజే సాయి ఫార్మా కంపెనీలో ప్రమాదం జరగడం ఒక కార్మికుడు కాలిపోవడం విచారకరమని,చనిపోయిన కార్మికుడు పవన్ కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండానే టీఎస్ ఐపాస్ లో అనుమతులు తెచ్చుకుని గ్రామపంచాయతీలో ఎలాంటి అనుమతులు గ్రామసభలు తీర్మానాలు లేకుండా ఇష్టం వచ్చినట్టుగా నిర్మాణాలు చేసుకొని కార్మికులు ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు మామూళ్ల మత్తులో మునిగితేలుతున్నారని ఫిర్యాదు ఇస్తే ఫిర్యాదును ఆధారంగా చేసుకుని డబ్బులు వసూలు చేసుకుంటున్నారు తప్ప ఎలాంటి తనిఖీలు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. విజే సాయి ఫార్మా పరిశ్రమల్లో చనిపోయిన కార్మికుల కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని యాజమాన్యం మీద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఈ సందర్భంగా స్థానికులు డిమాండ్ చేశారు.

## మాట నిలబెట్టుకున్న కౌన్సిలర్



**చిట్యాల, విశాలభారతి:** మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డు కౌన్సిలర్ నిమ్మనగోటి శ్రీనివాస్ వార్డు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.మున్సిపాలిటీ ఎన్నికల్లో తనను కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డు పరిధిలోని ప్రతి ఇంటి ఆడ బిడ్డ వివాహానికి రూ.10,016 లను కానుకగా ఇస్తానని మాట ఇచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం అంబేద్కర్ నగర్ కు చెందిన కీ. శే సుంకరి నరసింహ పద్మ ల ప్రథమ పుత్రిక రాజేశ్వరి వివాహానికి కౌన్సిలర్ నిమ్మనగోటి శ్రీనివాస్,యువశక్తి యువజన సంఘం సభ్యులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి రూ.10,016లను కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో యువశక్తి యువజన సంఘం అధ్యక్షులు ఐలపురం నరేష్,సంఘ సభ్యులు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దుస్తులు పంపిణీ చేసిన రెండవ డివిజన్ కార్పొరేటర్



**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండలం మాణిక్ బండారు రెండవ డివిజన్ పరిధిలోని అంగన్వాడి సెంటర్లో శుక్రవారం రోజున స్కూల్ కు వచ్చే చిన్నారులకు దుస్తువులు పంపిణీ చేసిన రెండవ డివిజన్ కార్పొరేటర్ మారంపల్లి మోహన్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దుస్తులను ఈరోజు 12 మంది విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగినది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు పోషక ఆహారాలు అందించే విధంగా మరియు పిల్లలకు కూడా ఆహారాన్ని అందించాలని చిన్నారులను బాగా చూసుకోవాలని అంగన్వాడి ప్రభుత్వం అందించే మెనూ ప్రకారం విద్యార్థులకు సరైన టైంలో పౌష్టికాహారాన్ని అందించాలని ఈ కార్యక్రమంలో అంగన్వాడి నిర్వాకులు కవిత. అనిల్ హనుమాన్లు శివ లాల్ ఉమేష్ సన్నీ రాకేష్ ఆయన తెలియజేశారు.

## కలెక్టర్‌కి వినతి



**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండలం గొట్టుముక్కల గ్రామంలో ఈరోజు నిజామాబాద్ కలెక్టర్ జిల్లా త్రిపాటికి కలవడం జరిగినది. విన్నవించేది ఏమనగా మేము ప్రస్తుతం మాక్లూర్ పరపతి సహకార సంఘం సొసైటీ పరిధిలో కొనసాగుతున్నాం అయితే మాకు ప్రతి విషయంలో మాక్లూర్ వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాము గతంలో గొట్టుముక్కల లో ఉన్న సొసైటీని మాక్లూర్ విలీనం చేశారు అలాగే ఇక్కడ రెండు వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు మరియు మా ప్రాంతంలో అధిక విస్తీర్ణంలో సాగుభూమి ఉండడం వల్ల సకాలంలో ఎరువులు అందరం లేదు ఈ సమస్య తీరాలంటే గొట్టుముక్కల గ్రామంలో సొసైటీ ఏర్పాటు చేయడమే మార్గమని చుట్టుపక్కల గ్రామాల రైతుల మాకు మేము ఒక నిర్ణయానికి వచ్చాము అందులో భాగంగా గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి గారికి మరియు అధికారులు అనేక పర్యాయాలు వినతి పత్రం అందించాం కానీ మా సమస్య పరిష్కారం కాలేదు మీ ఆధ్వర్యంలో మా సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తూ తొమ్మిది గ్రామాల గొట్టుముక్కల బంకన్పల్లి మెట్పల్లి ధర్మోరా మెట్టు రాంపూర్ వెంకటాపూర్ మాందాపూర్ లక్ష్మాపూర్ రైతులము స్థానిక ఇబ్బందుల ఆధ్వర్యంలో ఒక కమిటీగా ఏర్పడి సొసైటీ ఏర్పాటుకు సాగిన కల్పించాము అందుకోసం ఇన్ని గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా తీర్మానాలు చేశాయి కావున మా యొక్క సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం అందించడం జరిగినది.

## బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ సస్పెన్షన్

**ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం**



**విశాల భారతి, అబ్దుల్లపూర్ మెట్ :** ఎల్ బి నగర్ నియోజకవర్గం హయత్ నగర్ డివిజన్ లోని ఇంజాపూర్ ప్రధాన రోడ్డులో "మద్రాస్ ఫిల్టర్ కాఫీ" సెంటర్‌ను ఘనంగా ప్రారంభించారు. స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభోత్సవం నిర్వహించగా, బి ఆర్ ఎస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ విషయాన్ని హోటల్ నిర్వాహకులు జె జె రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ..స్థానికులకు నాణ్యమైన , శుభ్రమైన వాతావరణంలో సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కాఫీ సెంటర్‌ను ప్రారంభించిన నిర్వాహకులను అభినందించారు. స్థానిక వ్యాపారాలు అభివృద్ధి చెందాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు.

## రామ మందిరంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన

**భక్తి నినాదాలతో మారుమోగిన వేములకొండ**

**వలిగొండ, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని వేములకొండ గ్రామంలో శ్రీ అయోధ్య రామ మందిరం వద్ద నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. డప్పు చప్పుళ్ల మధ్య "జై శ్రీరామ్" నినాదాలతో గ్రామం మొత్తం భక్తి పరవశంలో మునిగిపోయింది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఈ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ధ్వజస్తంభానికి విరాళాన్ని శ్రీ సోలిపురం శ్రీకాంత్ రెడ్డి - రిష్మిత దంపతులు అందించగా, భక్తులకు అన్నప్రసాద వితరణ కోసం ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన మండపాన్ని కేసిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి - రాధిక దంపతులు విరాళంగా నిర్మించారు. విరాళదాతలను గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన గ్రామ సర్పంచ్ ఎర్రుల వెంకటేశం మాట్లాడుతూ "శ్రీ అయోధ్య రామ మందిరంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మా గ్రామ ప్రజల చిరకాల వాంఛ. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన ఈ పవిత్ర కార్యక్రమం నేడు విజయవంతంగా జరగడం ఎంతో ఆనందంగా ఉంది. విరాళదాతల సహకారంతో ఈ మహోత్సవం ఘనంగా నిర్వహించగలిగాం." అన్నారు. ఉపసర్పంచ్ సాయికుమార్ మాట్లాడుతూ.. ఈ ధ్వజస్తంభ ప్రతిష్టాపన వేములకొండ గ్రామ ఐక్యతకు ప్రతీక. గ్రామ అభివృద్ధి, ఆధ్యాత్మిక వికాసానికి ఇది ఒక శుభారంభం అవుతుందని ఆశిస్తున్నాము." అని తెలిపారు.

DISTRICT news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# రక్త మార్పిడి కేంద్రాన్ని సందర్శించిన ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు



**నిజామాబాద్ , విశాలభారతి:** బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గల ఉచిత డయాలసిస్ రక్త మార్పిడి కేంద్రాన్ని శుక్రవారం రోజున ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు సందర్శించారు రక్తమార్పిడి చేసుకున్న రోగులకు ఆరోగ్య ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని వారి ఆరోగ్య పరిస్థితిని వారికి అడిగి తెలుసుకున్నారు డయాలసిస్ పేషెంట్లకు అవసరమైన మందులను రాసి ఇచ్చి వారికి సూచనలు చేశారు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ఉస్మానియా ఆసుపత్రికి రావాలని సూచించారు ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు రోగులకు ముఖ్యంగా మంచినీరు అధికంగా త్రాగడం వల్ల ఆయాసము దమ్ము వస్తాయని మంచినీరు తక్కువ మోతాదులో తీసుకోవాలని తెలిపారు అలాగే ఉప్పు తక్కువగా వాడాలని అధిక మోతాదులో వాడడం వల్ల కిడ్నీలపై అధిక భారం పడుతుందని ఉప్పు తక్కువగా వాడాలని సూచించారు మందులు సక్రమంగా సరి అయిన సమయంలో వేసుకోవాలని సూచించారు ఉస్మానియా ఆసుపత్రి నుంచి వచ్చిన వారిలో వైద్యులు విజేత. డాక్టర్ రాథోడ్ లతోపాటు ఉచిత డయాలసిస్ బోధన్ కేంద్రం నిర్వాహకులు క్లస్టర్ మేనేజర్ శ్రీహరి. మయూర్. కళ్యాణ్. వినోద్ తదితరులు ఉన్నారు

# ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలి



**జిల్లా సంక్షేమ అధికారిణి డి. పద్మ**

**నిజామాబాద్, విశాలభారతి:** ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందేలా మండల అధికారులు సమన్వయంతో పని చేయాలని నిజామాబాద్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి, సాలురా మండల ప్రత్యేక అధికారి డి. పద్మ సూచించారు. శుక్రవారం ఆమె సాలురా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరును ఆమె అడిగి తెలుసుకున్నారు. సమీక్ష అనంతరం ఆమె సాలురా మండలంలోని పలు విద్యాసంస్థలను సందర్శించారు. అచ్చన్‌పల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల ను సందర్శించి, అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. అనంతరం సాలురా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులను, సిబ్బందిని ఆదేశించారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**విశాలభారతి, గోదావరిఖని:** తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి వారిని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల శ్రేయస్సు, శాంతి, సౌభాగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

# శ్రీకాళహస్తిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కుటుంబ సభ్యులు



**విశాలభారతి, గోదావరిఖని:** శ్రీకాళహస్తి ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనాలు చేశారు. కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

# డాక్టరేట్ అందుకున్న కిన్నెర మొగులయ్యకు సన్మానం

**అరుదైన కళాకారుడికి అభినందనలు ఇన్స్పెక్టర్ మహేశ్**



తెలంగాణ సంస్కృతిలో అరుదైన కళగా పేరొందిన 12 మెట్ల కిన్నెర గానాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప కళాకారుడు పద్మశ్రీ దర్శనం మొగులయ్య' అని వనస్థలిపురం పోలీస్ ఇన్స్పెక్టర్ టి. మహేశ్ అన్నారు. అంతరించి పోతున్న కళను తన ప్రదర్శనల ద్వారా వెలుగులోకి తెచ్చిన మొగులయ్యకు ఇటీవల చెన్నైలోని 'గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ' గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం వనస్థలిపురం పీఎస్కు వచ్చి ఇన్స్పెక్టర్ మహేశ్ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ మొగులయ్యను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కళారంగంలో వారి కృషి రాష్ట్రానికి , దేశానికి గౌరవాన్ని తీసుకువచ్చిందని ఇన్స్పెక్టర్ టి. మహేశ్ ప్రశంసించారు.

# రూ.9.80 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన



**రాజేంద్రనగర్, విశాలభారతి :** నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మైలర్ దేవ్ పల్లి డివిజన్‌లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో సుమారు రూ.9 కోట్ల 80 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులకు అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలను తెలుసుకుంటూ దశలవారీగా పరిష్కారం చూపిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# శ్రీ సంత్ సేవలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ



**రాజేంద్రనగర్, విశాలభారతి :** హైదరాబాద్ నగరంలోని కాటేదాన్ టి ఎన్ జి ఓ' ఎస్ కాలనీ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సంత్ సేవలాల్ మహరాజ్ 287వ జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత మద్యానికి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మంచి విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నదని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు తెలిపారు.

# ఎల్బీనగర్ జోన్‌లో అక్రమ నిర్మాణాల జోరు

- నాగోల్ సర్కిల్‌లోని నాగోల్, కుంట్లూర్,పెద్ద అంబర్పేట్‌లో విచ్చలవిడిగా నిర్మాణాలు
- భారీ ఎత్తున కమర్షియల్ షెడ్ల నిర్మిస్తున్న నిర్వాహకులకు ... నోటీసులకే పరిమితమవుతున్న అధికారుల చర్యలు?
- చోద్యం చూస్తున్న అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి అని స్థానికుల డిమాండ్?





పెద్ద అంబర్పేట్–కుంట్లూర్ మార్గంలో వరుస అక్రమ షెడ్లు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ నాగోల్ సర్కిల్ లో ఉన్న నాగోల్,మన్సూరాబాద్, జి ఎస్ ఐ,జడ్జెస్ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, బండ్లగూడ, ఆనంద్ నగర్, తట్టి అన్నారం కుంట్లూర్, పెద్ద అంబర్పేట్ ఏరియాల్లో విచ్చలవిడిగా అక్రమంగా కమర్షియల్ షెడ్ల నిర్మాణాలు పరిమితికి మించి భవన నిర్మాణాలు చేపడుతున్న కొనసాగుతున్నాయనే ఆరోపణలు తీవ్రరూపం దాల్చుతున్నాయి.

**నాగోల్ సర్కిల్‌లో నోటీసుల పేరుతో కాలయాపన**

నాగోల్ సర్కిల్ పరిధిలో ప్రధాన రహదారుల వెంట, కాలనీల్లో, నివాస ప్రాంతాలను కమర్షియల్ జోన్లుగా మార్చుతూ అనుమతుల్లేకుండా షెడ్లు నిర్మించడం, సెల్లార్ తవ్వకాలు చేపట్టడం, అనుమతులకన్నా ఎక్కువ అంతస్తులు వేయడం బహిరంగంగానే సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినా, ఫోన్ ద్వారా సమాచారం అందించినా అధికారులు కేవలం నోటీసులు జారీ చేశాం అనే సమాధానంతో కాలయాపన చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నోటీసుల తర్వాత ఫాలోఅప్ లేకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది.

**పెద్ద అంబర్పేట్–కుంట్లూర్ మార్గంలో వరుస అక్రమ షెడ్లు**

పెద్ద అంబర్పేట్ నుండి కుంట్లోర్ మార్గం వెంట భారీ ఎత్తున కమర్షియల్ షెడ్లు నిర్మిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రెసిడెన్షియల్ ప్రాంతాలను గోదాంలుగా మార్చేస్తూ పెద్దపెద్ద నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. బండ్లగూడ ఆనంద్ నగర్‌లో భారీ నిర్మాణం బండ్లగూడ ఆనంద్ నగర్ ప్రాంతంలో తాజా హోటల్ పక్కనే భారీ షెడ్ నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఒక్క నోటీసు కూడా జారీ చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణాలు పూర్తయ్యే దశకు చేరుకున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది.

**అధికారుల మౌనం వెనుక కారణాలేమిటి?**

చైన్ మాన్ , టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్వాహకులకు వత్తాసుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. నోటీసులు ఇవ్వకుండా లేదా కేవలం నోటీసులకే పరిమితమై నిర్మాణాలు పూర్తయ్యేంతవరకు కాలయాపన చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా భవిష్యత్తులో భద్రతా సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

**ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలి**

నాగోల్ సర్కిల్ నుంచి పెద్ద అంబర్పేట్, కుంట్లూర్, బండ్లగూడ ఆనంద్ నగర్ వరకు కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. చట్టం అందరికీ సమానమని నిరూపించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎన్నికల్లో అభ్యర్థులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తా



- ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్
- బంగారిగడ్డలోని శ్రీ సంతోషిమాత దేవాలయాన్ని అభివృద్ధికి చేస్తా
- 100 పడకల హాస్పిటల్ ను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి

**చౌటుప్పల్, విశాలభారతి:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన కౌన్సిలర్ అభ్యర్థులకు తాను ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని ఇ.ఎల్.వి.భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగుదిండ్ల భాస్కర్ స్పష్టం చేశారు.మున్సిపల్ ఎన్నికల సమయంలో పలువురు కౌన్సిలర్ అభ్యర్థులకు గెలిచి వస్తే వార్డు అభివృద్ధికి నా వంతు తోడ్పాటు అందిస్తానని,ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో అండగా ఉంటానని తెలిపారు.అందులో భాగంగా పట్టణ కేంద్రంలోని 16వ వార్డు కౌన్సిలర్ బత్తుల జయమ్మదాస్ కు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణ కేంద్రంలోని బంగారిగడ్డలో కాలనీలో అసంపూర్తిగా ఉన్న శ్రీ సంతోషిమాత దేవాలయాన్ని సందర్శించి నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం దేవాలయంలోని మిగిలిపోయిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ఆలయ గర్భగుడిలో టైల్స్, గ్రానైట్ ఫ్లోరింగ్, చుట్టూ గ్రిల్స్, బోరుబావికి మోటారు వంటి మౌలిక వసతులను కల్పిస్తామని తెలిపారు. చౌటుప్పల్‌లో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని వెంటనే పూర్తి చేసి పేద ప్రజలకు వైద్య సేవలు అందేలా చూడాలని రాబోయే కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష సభ్యులు గళమెత్తాలని పిలుపునిచ్చారు. పట్టణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పోరాటంలో తాను స్వయంగా పాల్గొంటానని స్పష్టం చేశారు. విద్య, వైద్యం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మున్సిపాలిటీ లో ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకు రావాలన్నారు.అనంతరం దేవాలయ చైర్మన్, మాజీ ఎంపీపీ చిక్కా నరసింహ నేత ఆధ్వర్యంలో భాస్కర్‌ను శాలువాతో సన్మానించారు.

# మటన్, చికెన్ షాపులపై ఆకస్మిక దాడులు



- కుళ్లిపోయిన మటన్ సీజ్ లైసెన్స్ లేకపోవడంతో షాప్ సీజ్ చేసి కోర్టుకు తరలింపు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ సర్కిల్‌లో మీర్‌పేట్ నంది హిల్స్ టీచర్స్ కాలనీలో ఉన్న మటన్, చికెన్ షాపులపై వెటర్నరీ అధికారి డాక్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ చర్యలు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల సందర్భంగా సైదులు మటన్ & చికెన్ సెంటర్ లో కుళ్లిపోయిన మటన్‌ను ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసి విక్రయానికి సిద్ధంగా ఉంచినట్లు గుర్తించారు. వెంటనే ఆ మాంసాన్ని సీజ్ చేయడంతో పాటు సంబంధిత షాప్‌కు అవసరమైన లైసెన్స్ లేకపోవడంతో షాప్‌ను సీజ్ చేసి కోర్టుకు పంపించారు. ఇతర మటన్, చికెన్ షాపుల్లో కూడా సరైన లైసెన్సులు లేకపోవడం, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం వంటి నిబంధనల ఉల్లంఘనలు బయటపడటంతో జరిమానాలు విధించారు.ఈ సందర్భంగా డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడైనా ఇలాంటి సమస్యలు ఎదురైతే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు 24 గంటల పాటు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి, రాష్ట్ర కార్యదర్శి కడమంచి అజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల మల్లేష్, రాష్ట్ర నాయకులు అరుణ్ సింగ్, దుశ్యంత్ బల్బీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

- డిపిఓను కోరిన నెర్రపల్లి గ్రామస్థులు



**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:** అనుమతులు లేని అక్రమ భవనంపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని నెర్రపల్లి గ్రామస్తులు జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ ను కోరారు. నెర్రపల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 38 లో అనుమతులు లేకుండానే పెద్ద ఎత్తున భవన నిర్మాణం పనులు చేపడుతున్నారని తక్షణమే స్పందించి ఆ నిర్మాణం పై చర్యలు చేపట్టాలని ఆ గ్రామస్తులు డిపిఓ ను కోరారు. స్పందించిన డిపిఓ పంచాయతీ కార్యదర్శికి ఫోన్ ద్వారా పర్మిషన్ లేకుంటే వెంటనే పనులు నిలిపివేయమని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి భవన నిర్మాణానికి అనుమతులు లేవని , పనులు చేపట్టొద్దని భవన యాజమానికి నోటీసు ఇచ్చారు.

# వైద్యుల నిర్లక్ష్యమే పసికందు ప్రాణం తీసింది

**యాచారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన**

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** వైద్యుల నిర్లక్ష్యం వల్లనే పసికందు ప్రాణం తీసిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసమని వెళ్లిన గర్భిణీ సరైన వైద్యం అందక వైద్యుల నిర్వాకంతో పుట్టిన పసికందు మృతి చెందిన ఘటన శుక్రవారం కలకలం రేపింది. మల్కీజు గూడకు చెందిన నాన్కంపేట కృష్ణ సతీమణి కళ్యాణి గర్భిణిగా ఉన్న ఆమె పురిటి నొప్పులతో ప్రసవం కోసం ఈనెల 19న ఉదయం యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఉదయం నుంచి సాయంత్రం 6 వరకు తీవ్రమైన నొప్పులతో ఇబ్బందులు పడుతున్న కళ్యాణికి మగ శిశువు జన్మించగా సరైన వైద్యం అందక పసికందు మృతి చెందింది. ప్రసవం అయ్యేలా లేదని నగరంలోని ఆసుపత్రికి వెళ్తామని కుటుంబీకులు వైద్యులకు చెప్పిన వినకుండా బలవంతంగా ప్రసవం చేసి శిశువు మృతికి కారణమయ్యారని బంధువులు, కుటుంబీకులు ఆరోపించారు. సర్పంచ్ శంకర్, ఉప సర్పంచ్ శిరీష వెంకటేష్ మాట్లాడుతూ వైద్య సేవలు అందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని పసికందు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణం అన్నారు. ఇలాంటి నిర్లక్ష్య ఘటనలపై, వైద్యుల పని తీరుపై ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# చిల్కూర్‌లో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్ విజయవంతం



**మొయినాబాద్, విశాలభారతి:** భారత ప్రభుత్వ వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని మొయినాబాద్ మండలం చిల్కూర్ గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలలో నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు విద్యార్థుల్లో మట్టి ఆరోగ్య ప్రాముఖ్యత, స్థిరమైన వ్యవసాయ విధానాలు మరియు భూమి సంరక్షణపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన లక్ష్యాల్లో భాగంగా వ్యవసాయ శాఖ మరియు పాఠశాల విద్యాశాఖ సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీమతి అనురాధ, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీ సునీల్ కుమార్, శ్రీ పండరి, పాఠశాల ప్రిన్సిపాల్ ఇన్‌చార్జ్ శ్రీ ఎం. షౌరి రాజు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు శ్రీ జి. సునీల్ కుమార్ (TGT), శ్రీమతి మాధురి (TGT), శ్రీమతి పి. సునీత (TGT) విద్యార్థులను ప్రోత్సహించారు. 9వ, 10వ తరగతులకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులకు మట్టి సారవంతత, మట్టి నమూనాల సేకరణ విధానం, మట్టి పరీక్ష పద్ధతులు, సాయిల్ హెల్త్ కార్డు ఉపయోగాలపై వివరంగా అవగాహన కల్పించారు. సమీప రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించడం, ఫలితాల ఆధారంగా సాయిల్ హెల్త్ కార్డులు తయారు చేసి రైతులకు అందజేయడం వంటి అంశాలపై కూడా వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ వ్యవసాయం పట్ల అవగాహన పెంపొందించి, భవిష్యత్తులో మట్టి ఆరోగ్య పరిరక్షణలో వారు భాగస్వాములు కావాలని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

# హిమత్‌నగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న అండర్‌డ్రైనేజ్ నీరు



**మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**

**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ హిమత్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డుపై అండర్‌డ్రైనేజ్ నీరు ప్రవహిస్తుండటంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే హిమత్‌నగర్ నుంచి చిలుకూరు బాలాజీ ఆలయంకు వెళ్లే ప్రధాన రహదారిపై మురుగు నీరు పారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా భక్తులు, విద్యార్థులు, వాహనదారులు ఈ మార్గాన్ని ఎక్కువగా వినియోగిస్తుండగా, రోడ్డుపై నిల్వవున్న మురుగు నీటితో దుర్వాసన వ్యాపిస్తూ ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం లేకపోయినా అండర్‌డ్రైనేజ్ లీకేజీ కారణంగా నీరు రోడ్డుమీదకు వస్తోందని చెబుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని, భద్రతను పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే లీకేజీని గుర్తించి మరమ్మతులు చేపట్టి, రోడ్డును శుభ్రపరిచి ప్రజలకు ఉపశమనం కల్పించాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

**ముఖ్య అతిథులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ,**




**బోడుప్పల్, విశాలభారతి:** బోడుప్పల్ సర్కిల్లో శుక్రవారం నాడు శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయ స్వామి గుడి పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ సీతారామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి , డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ , స్థానిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నరసింహారెడ్డి , మాజీ మేయర్ తోటకుర అజయ్ యాదవ్ , మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ , మాజీ జెడ్పిటిసి మంద సంజీవరెడ్డి మాజీ మేయర్ కార్పొరేటర్లు. ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి





# బాలీవుడ్ బాట పట్టిన మీనాక్షి

హిట్ 2, లక్కీభాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒక రాజు చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన మీనాక్షి చౌదరి బాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా రాజ్ శాండిల్య దర్శకత్వంలో రూపొందుతోన్న 'భాగమ్ భాగ్ 2'లో ఈ ముద్దుగుమ్మ కథానాయికగా ఎంపికైంది. గతంలో వచ్చిన సూపర్‌హిట్ కామెడీ మూవీ 'భాగమ్ భాగ్'కు ఈ సినిమా సీక్వెల్ కావటం విశేషం. తొలి భాగం తరహాలోనే పక్కా కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందనున్నదని, మీనాక్షి కెరీర్‌లో ఓ మైలురాయిగా ఈ సినిమా నిలువనున్నదని బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ నెలలోనే షూటింగ్ ప్రారంభించి, ఈ ఏడాది చివరిలో సినిమాను విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. మనోజ్ బాజ్‌పాయ్, అయేషాఖాన్ ఇందులో కీలక పాత్రధారులు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.